# కూటమి ప్రభుత్వంలో నందిగామకు అభివృద్ధి జోరు

● రూ.2.50 కోట్ల ఆర్‌అండ్‌బీ నిధులతో రహదారి అభివృద్ధి పనులు ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నందిగామ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు.నందిగామ మండలం చందాపురం క్రాస్ రోడ్ వద్ద ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రూ. 2.50 కోట్ల నిధులతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు కూటమి నేతలు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గారు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.కూటమి ప్రభుత్వం నందిగామ అభివృద్ధి అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి దశలవారీగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.కార్యక్రమంలో కూటమి నేతలు, ఆర్‌అండ్‌బీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అవార్డుతో మరింత బాధ్యత.. సతీష్‌కు ఘన సత్కారం

పచ్చదనం.. సేవా బాటలో పుట్టగుంట సతీష్





**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష సేవలు అందిస్తున్న పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్ కుమార్ అభినందనీయులని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మత్తి సాంబశివరావు కొనియాడారు. బొమ్ములూరులోని 1947 ఐఎన్‌సీ ఫ్యాక్టరీకి రాష్ట్రస్థాయి అవార్డు లభించిన సందర్భంగా సోమవారం లయన్స్ క్లబ్ సభ్యులు పుట్టగుంట సతీష్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత, మహిళలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఫ్యాక్టరీ ఆవరణలో పచ్చదనాన్ని పెంపొందిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. అత్యవసర సమయాల్లో పేదలకు విద్య, వైద్య పరంగా అండగా నిలవడం, రహదారి భద్రత కోసం పోలీసులకు అవసరమైన సహకారం అందించడం వంటి సేవలు అభినందనీయమన్నారు. గత రెండు దశాబ్దాలుగా భవానీలకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించడం ఆయన సేవాభావానికి నిదర్శనమని సాయి కళ్యాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తన గురువు, లయన్స్ క్లబ్ కార్యదర్శి అక్కినేని రాఘవేంద్రరావును పుట్టగుంట సతీష్ కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి అక్కినేని రాఘవేంద్రరావు, కోశాధికారి మత్తి రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు కలపాల రంగారావు, అక్కినేని శ్రీనివాస పణీంద్ర, కళ్లేపల్లి నారాయణరావు, నందిగం స్వామి, మాకినేని శ్రీనివాసరావు, చలసాని వెంకటేశ్వరరావు, తుమ్మల నారాయణరావు, బోయపాటి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ ఆరోగ్య ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

-ఐఎన్ టియుసి కాకినాడ జిల్లా అధ్యక్షులు బొంతు శ్రీనివాస్



**కాకినాడఅక్టోబర్ 5 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుదీర్ఘకాలంగా కాంట్రాక్టు పద్ధతిలో సేవలందిస్తున్న వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఐఎన్ టియుసి కాకినాడ జిల్లా అధ్యక్షులు బొంతు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద తమ న్యాయమైన హక్కుల కోసం నిరసన చేస్తున్న వైద్య సిబ్బంది దీక్షా శిబిరాన్ని ఐఎన్ టియుసి ఉద్యోగులు సందర్శించి,సంఘం తరపున పూర్తి మద్దతు ప్రకటించారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ తక్షణమే క్రమబద్ధీకరించాలని ఆ ప్రక్రియ పూర్తయ్యే లోపు 100% గ్రాస్ వేతనం చెల్లించాలని ఆయన డిమాండు చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయ పోరాటానికి ఐఎన్ టియుసి అండగా నిలుస్తుందని తెలిపారు.ఆయనతో పాటు ఐఎన్ టియుసి ఉద్యోగులు కిషోర్,పతంజలి , రామారెడ్డి, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# 20వ రోజుకు చేరిన వీఆర్ఏల సమ్మె...




**గుడ్లవల్లేరు,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** మండలంలోని గ్రామ రెవిన్యూ సహాయకులు తమ కోర్కెలపై గుడ్లవల్లేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె సోమవారంతో 20వ రోజుకు చేరింది. ప్రభుత్వానికి తమగోడును ఎన్ని రోజులుగా తెలియజేసినా...ఫలితం లేకపోతుందని వీఆర్ఏల సంఘ గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు ఉడుముల రవికుమార్, ఆ సంఘ నాయకులు చార్లెస్, కిరణ్, ఫైజుల్లా, ఆదర్శ్ తదితరులు చెప్పారు.

# సేవాసేతు అభియాన్ సద్వినియోగం చేసుకోవాలి..

-అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



**అవనిగడ్డ,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** సోలార్ విద్యుత్తు వినియోగం పెంచడమే లక్ష్యంగా సింగిల్ డెస్క్ విధానంలో ప్రభుత్వం చేపట్టిన సేవాసేతు అభియాన్ సద్వినియోగం చేసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. సోమవారం అవనిగడ్డలో ఎమ్మెల్యే తమ కార్యాలయంలో సేవాసేతు అభియాన్ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ నెల 6,7,8 తేదీల్లో అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల విద్యుత్ వినియోగదారుల కోసం అవనిగడ్డ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో, చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల విద్యుత్ వినియోగదారుల కోసం చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో సేవాసేతు అభియాన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని విద్యుత్ వినియోగదారుల కోసం పీఎం సూర్య ఘర్ – సోలార్ విద్యుత్తు వినియోగంపై అవగాహన, దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేసే ఉద్దేశంతో ఈ వేదిక ద్వారా విద్యుత్ వినియోగదారులు పీఎం సూర్య ఘర్ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి ఏమైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో ఉండి వినియోగదారులకు సహకరిస్తారని తెలిపారు. వీరితో పాటు పలు బ్యాంకుల అధికారులు కూడా ఈ మూడు రోజులు సదస్సులో పాల్గొని అర్హతను బట్టి వినియోగదారులకు అవసరమైన రుణ సదుపాయాలు కూడా కల్పిస్తారని తెలిపారు. సింగిల్ డెస్క్ విధానంలో మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం అందించే సబ్సిడీతో సోలార్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకొని తమ విద్యుత్తు ఖర్చులు తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చల్లపల్లి ఏడీఈ పేర్ని రవికుమార్, ఘంటసాల ఏఈ పిరియా రవికుమార్ పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలి

● కృష్ణా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన వి హెచ్ పి



**మచిలీపట్నం,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దసరా మహోత్సవాలను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించి శాశ్వత ప్రాతిపదికన నిర్వహించాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పీ) కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో ప్రతినిధులు సోమవారం కృష్ణా జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రసన్నాంజనేయులు దూళిపాల రాము విజయబాబు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం సతీష్ తదితరులు పాల్గొన్నారు. ప్రకాశం బ్యారేజీ--అర్జునవీధి--ఇంద్రకీలాద్రి ఆలయానికి వెళ్లే ప్రధాన మార్గాల్లోని అక్రమ ఆక్రమణలు అనధికార నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని చట్టవిరుద్ధమైనవిగా నిర్ధారణ అయిన ఆక్రమణలను తొలగించి ఆలయానికి సంబంధించిన సంప్రదాయ మార్గాలను పరిరక్షించాలని విహెచ్‌పీ కోరింది.

**ఆలయ హుండీ నిధులతో ప్రభుత్వ బాధ్యతలు నిర్వహించొద్దు..**

దసరా ఉత్సవాల సమయంలో ప్రభుత్వ శాఖలు అందించే సాధారణ ప్రజా సేవలకు అయ్యే ఖర్చులను ఆలయ హుండీ నిధుల నుంచి కాకుండా సంబంధిత ప్రభుత్వ శాఖల బడ్జెట్ నుంచే భరించాలని విహెచ్‌పీ స్పష్టం చేసింది. ఆలయ ఆదాయాన్ని ఆలయ నిర్వహణ భక్తుల సౌకర్యాలు ధార్మిక కార్యక్రమాలు ఆలయ సంరక్షణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యంగా వినియోగించే విధంగా స్పష్టమైన విధానం ఉండాలని కోరింది. కామన్ గుడ్ ఫండ్ సేకరణ కేటాయింపు, వినియోగానికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని విహెచ్‌పీ కోరింది. ప్రతి సంవత్సరం నిధుల సేకరణ కేటాయింపులు, వ్యయ వివరాలతో శ్వేతపత్రం లేదా వార్షిక ప్రజా నివేదిక విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఇంద్రకీలాద్రి అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను ప్రజల ముందుంచి భూసేకరణ, రహదారులు పార్కింగ్, క్యూ వ్యవస్థ పారిశుద్ధ్యం అత్యవసర సేవలు, వారసత్వ పరిరక్షణ పర్యావరణ రక్షణ ప్రాజెక్టు వ్యయం అమలు గడువులను స్పష్టంగా వెల్లడించాలని కోరింది. ఈ సందర్భంగా విహెచ్‌పీ కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బూరగడ్డ శ్రీనాథ్ మాట్లాడుతూ ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసాలతో ముడిపడి ఉన్నాయని అన్నారు. భక్తుల ప్రయోజనాలు, ఆలయ పరిరక్షణ, పారదర్శక పరిపాలన కోసం ఈ అంశాలపై పట్టుదలతో ముందుకు సాగుతున్న విహెచ్‌పీ ప్రతినిధులను ఆయన అభినందించారు.

# కొండలమ్మ సన్నిధిలో దసరా ఉత్సవాల పోస్టర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే వెనిగండ్ల...



**గుడ్లవల్లేరు,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** మండలంలోని వేమవరం గ్రామములో వెంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు జరుగునున్న దసరా నవరాత్రుల మహోత్సవాల పోస్టర్లను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోమవారం ఆయన చేతుల మీదగా గుడివాడలోని తన నివాసంలో ఆవిష్కరించారు. అమ్మవారి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు, ఈవో ఆకుల కొండలరావు సభ్యులు కళ్ళేపల్లి సుగుణ శేఖర్, మన్నెం వీర నాగేంద్రరావు, ముంగం ఆంజనేయులు, తూము రాజ్యలక్ష్మీ, నూతలపాటి లక్ష్మీ పావని, పెన్నేరు వీర వెంకట నాగ లీల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వెల్వడం జెడ్పి పాఠశాల విద్యార్థులు ఎంపిక



**మైలవరం (వెల్వడం),అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వెల్వడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.బసవరావు సోమవారం తెలిపారు.విజయవాడ రైల్వే స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ సెలక్షన్స్ లో వెల్వడం జెడ్పి స్కూల్ నుంచి ప్రత్తిపాటి జోషి బాబు, మేడూరి సంజయ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం తెలియజేశా రు.అక్టోబర్ 10, 11, 12 తేదీలలో నూజివీడు లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వెల్లడించారు.ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.బసవరావు, పిడి బి.నాగమణి, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ వి.గంగరాజు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందించారు.

# కాకినాడ పీఆర్ కళాశాలలో ఘనంగా పిఠాపురం రాజావారి 141 వ జయంతోత్సవాలు



**కాకినాడ,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** స్థానిక పిఠాపుర రాజా ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వి కె మెహెర్ ఆధ్వర్యంలో రాజా రావు వెంకట కుమార మహీపతి సూర్యారావు బహదూర్ వారి 141 వ జయంతి ఉత్సవాలు కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు కళాశాల విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది,పుర ప్రముఖులు పాల్గొని స్థానిక జిల్లా పరిషత్ సెంటర్ వద్ద గల పిఆర్ సర్కిల్ లో ఏర్పాటు చేసిన రాజావారి విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. తదనంతరం కళాశాలలో గల రాజా తండ్రి గంగాధర రామారావు బహుదూర్ వారి విగ్రహానికి పూలమాలలు బహుకరించారు. తదనంతరం కళాశాలలో ఏర్పాటుచేసిన రాజావారి జన్మదిన వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజా వారు కాకినాడ పట్టణానికి చేసిన సేవలను, పిఆర్ విద్యాసంస్థల ఏర్పాటుకు అందించిన భూరి విరాళాలను రాజావారి దాతృత్వాన్ని పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు బామిరెడ్డి,నరసరాజ, మూర్తి, కొనియాడారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మెహర్ మాట్లాడుతూ రాజావారు కళాశాలకు చేసిన సేవలు చిరాస్మరణీయమని వారు నాటిన పిఆర్ విద్యా సంస్థలు అనే వృక్షము నీడన అనేక మంది విద్యార్థులు విద్యనభ్యసించి దేశ విదేశాలలో కీర్తి ప్రతిష్టలను అర్జించారని అదే పరంపరను రాబోయే తరాల విద్యార్థిని విద్యార్థులు కూడా కొన సాగించాలని ఆకాంక్షించారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘంతో కలిసి కళాశాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని ప్రిన్సిపల్ డాక్టర్ మెహెర్ హామీ ఇచ్చారు.

# ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు ఎప్పుడు..? ప్రమాదాలు తగ్గేది ఎన్నడు..?

- రోడ్లపై తగ్గేదేలే అన్న మాదిరిగా దూసుకు వస్తున్న వాహనాలు..
- ట్రాఫిక్ రూల్స్ కు పాతర.. చీటికి మాటికి ప్రమాదాల జాతర..
- ఎవడు ఏమైపోతే మాకేంటని.. ర్యాష్ డ్రైవింగ్ కే మొగ్గు చూపుతున్న యువత..
- అవగాహన కల్పించడంలో పోలీస్ శాఖ విఫలం..
- ఫోటోలు తీయడం, చలాన్లు విధించడమేనా...? అని బాధితుల ఆవేదన ఆరోపణ..

(మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూలూరి కిరణ్, తొర్రూరు,అక్టోబర్ 5 (వార్తాప్రభ) )

నేటి ఆధునిక కాలంలో మనిషి ప్రయాణం ఉరుకుల పరుగుల జీవితంగా మారిపోయింది. చెప్పలేనంత బిజీ తనం డ్రైవింగ్ లో మాత్రమే చూపించడం పరపాటిగా అయిపోయింది. డ్రైవింగ్ పై, ట్రాఫిక్ రూల్స్ పై మిడిమిడి జ్ఞానంతో వాహనాలు నడిపే వారి సంఖ్య అధికమవుతుంది. తద్వారా ఇతరుల ప్రాణాలకు ప్రాణ సంకటంగా మారుతుంది. చిన్న పెద్ద అన్న తేడా లేకుండా ట్రాఫిక్ రూల్స్ ను పాటించడంలో విఫలమవుతున్నారు. రాష్ డ్రైవింగ్ తో పాటు రాంగ్ రూట్ల ప్రయాణం రోజు రోజుకు పెరిగిపోతుంది. ఊహించని విధంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తుండగా ఇంకెంతో మంది క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేక కూడా అనేక ప్రమాదాలు జరుగుతున్న ఘటనలు ఉన్నాయి. కావున నాయకులు అధికారులు స్పందించి ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే స్పందించి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు వాహనదారులు కోరుకుంటున్నారు.

**డ్రైవింగ్ లో మాత్రమే అంత "బిజీ" చూపడం అవసరమా..?**

ఎక్కడ లేని బిజీ తనం కేవలం వాహనాన్ని డ్రైవ్ చేసే సమయంలో మాత్రమే చూయిస్తున్నారని, ఎందుకిలా...? కొంచెం మెల్లిగా రావచ్చు కదా అని చెబితే గొడవలకు దిగుతున్నారని పలువురు వాహనదారులు వాపోతున్నారు. క్షణికావేషానికి గురి కావడం.. రోడ్ల మీదనే ఘర్షణలకు దిగడం ... కొన్ని సందర్భాల్లో ఈ పంచాయతీలు పోలీస్ స్టేషన్ వరకు వెళుతున్నాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా మైనర్లు డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా యమ స్పీడ్ గా వచ్చి వాహనాలకు వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ప్రమాదాలకు గురైన బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఆరోపిస్తున్నారు. 2 నిమిషాలు ఓపిక సహనం ఎవరికి లేకుండా పోయిందని, ముఖ్యంగా యూటర్న్ ల దగ్గర, వై జంక్షన్ల దగ్గర, మూల మలుపుల వద్ద స్పీడ్ గా వచ్చి ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారని పలువురు వాపోతున్నారు.

**ట్రాఫిక్ రూల్స్ కు పాతర.. ప్రమాదాల జాతర..!** జనాభాకు తగ్గట్టుగా వాహనాల సంఖ్య పెరిగిపోవడం, రోడ్ల విస్తీర్ణం పెరగకపోవడం, ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించకపోవడం క్రమేపి ప్రమాదాల పరంపర రోజు రోజుకు పెరిగిపోతుందని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్న కనీస పరిజ్ఞానం ఉన్నప్పటికీ నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నారని, ఈ కేటగిరిలో ముఖ్యంగా మైనర్లు, యువకులతో పాటు విద్యార్థులు కూడా ట్రాఫిక్ రూల్స్ ను బ్రేక్ చేస్తున్నారని అంటున్నారు. చట్టాలు కఠినంగా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో శిక్షణ సంఖ్య అందుకు తగ్గట్టుగా లేకపోవడం విస్మయం కలిగిస్తుందని మేధావులు ఆవేదన చెందుతున్నారు.

**ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించడం అవసరం..!** ఇతరుల ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన ప్రతి ఒక్కరు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది. పెరుగుతున్న జనాభాను, వాహనాల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని




పోలీసు శాఖ ఎప్పటికప్పుడు వాహనదారులకు పట్టణ ప్రాంతాలతో పాటు పల్లె ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే పడే శిక్షణలపైన స్పష్టమైన క్లారిటీ ఇవ్వాలని... శిక్షలు విధించిన వారిని సైతం ఉదాహరణగా చూపిస్తే భయపడినా నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపుతారని పలువురు కోరుకుంటున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులను రక్షించేందుకు ఏ ఒక్కరు కూడా ముందుకు రాకుండా ఉంటేనే... తప్పు చేశారు కాబట్టి వారికి తగిన ట్రాఫిక్ శిక్ష విధించాల్సిన ఆవశ్యకత ఉన్నప్పుడే....! మరోసారి తప్పు చేస్తే తప్పించుకునే అవకాశం లేకుండా చేసినప్పుడే ట్రాఫిక్ రూల్స్ కు అడ్డుకట్ట వేయడానికి అవకాశం ఉంటుందని... పోలీసులు కూడా కేవలం ఫోటోలు తీయడం, చలాన్లను విధించడం, వాటిని వసూళ్లు చేయించే బాధ్యత వరకే పరిమితం కాకుండా... ప్రతి ఒక్కరూ రూల్స్ పాటిస్తూ వాహనాలు నడిపే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నప్పుడే.. ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందని.. చలాన్లు వేయడంలో వాటి వసూళ్లపై ఉన్న శ్రద్ధతోపాటు వాహనదారులకు అవగాహన కల్పించడంలో ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందని ప్రమాదాలకు గురైన బాధితులు ట్రాఫిక్ రూల్స్ పాటించే వారు మేధావులు పలువురు అభిప్రాయపడుతున్నారు.

**చలాన్ల వసూలు పై చూపిన శ్రద్ధ ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కలిగించండి**

– కొత్తపల్లి రవి.



మహబూబాబాద్ జిల్లాలోనే 2వ అతిపెద్ద పట్టణంగా వినతిని అభివృద్ధి చెందుతుంది అని అలాంటి తొర్రూరు పట్టణ కేంద్రంలో ట్రాఫిక్ అస్తవస్తంగా కొనసాగుతుందని పోలీసులు చలాన్లు వేయడం వాటిని వసూలు చేయుటలో చూపించే శ్రద్ధ... వాహనదారులకు ట్రాఫిక్ సిగ్నల్స్ తదితర అంశాల పై అవగాహన కల్పించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి కోరారు. రోడ్లపైనే వాహనాలు నిలపడం తదితర అంశాలపై అవగాహన కల్పించి మరోసారి తప్పు చేయకుండా కఠిన శిక్షలు తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు.

**ఇకనుంచి ముమ్మర తనిఖీలు..**

–తొర్రూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గణేష్..



వాహన దారులకు పాలుమార్లు ట్రాఫిక్ రూల్స్ హెల్మెట్ జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించినా కూడా ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా రాంగ్, రాష్, త్రిబుల్ రైడ్, మైనర్ డ్రైవింగ్ చేయడం వలన ప్రమాదాలు అధికంగా జరగడమే కాకుండా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కూడా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని... ఇకనుండి వాహన తనిఖీలు ముమ్మరం చేసి చలాన్లు విధించడంతోపాటు నిబంధనలను తుంగలో తొక్కిన వారికి శిక్షలు కూడా పడే అవకాశం ఉందని తొర్రూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గణేష్ హెచ్చరించారు. వాహనదారులు ముఖ్యంగా యువత ప్రత్యేకంగా తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ చూపుతూ మైనర్లకు బైకులు ఇవ్వడం యువతకు హై స్పీడ్ వాహనాలు ఇప్పించడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వీటిపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇకనుండి తొర్రూరు పరిధిలో వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహించి చలాన్లతో పాటు శిక్షలు కూడా వేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చలాన్లతో పాటు చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు..

## జవహర్ నగర్ పరిధిలోని భజరంగ్ కాలనీలో

### 34 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మాజీ మేయర్ శాంతి కోటేశ్ గౌడ్.





**జవహర్ నగర్, అక్టోబర్ 5(వార్తా ప్రభ):**కీసర సర్కిల్జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని భజరంగ్ కాలనీలో 34లక్షల రూపాయల నిధులతో 430 మీటర్ల సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన మాజీ మేయర్ మరియు డివిజన్ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యులు శ్వేతా ముకేశ్, శోభారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగారెడ్డి మనోదర్ రెడ్డి, భజరంగ్ కాలనీ అధ్యక్షులు ఇంద్రాసేన రావు, రాజేష్, గడ్డం శ్రీనివాస్, ఉపేందర్, అంగడి బాలరాజ్, నరేష్, అంగడి కృష్ణ, సుబ్బారావు మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ డిపో అధ్యక్షులుగా రాగం నాగేందర్ యాదవ్



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 5 (వార్తాప్రభ):** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ బస్సు డిపోలో తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డిపో యూనియన్ సభ్యులు శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ను గెలిపించాలని కోరారు.ఈ నెల 9న జరిగే యూనియన్ ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.అనంతరం బాణం గుర్తుకు ఓటు వేయాలని కార్మికులు ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్,యూనియన్ నాయకులు ఈ.అశ్వత్థామరెడ్డి, మొగుల్ల రాజిరెడ్డి, శంకర్, డిపో ఛైర్మన్ బాలయ్య, కార్యదర్శి వై.ఎస్. బసప్ప, అధ్యక్షుడు టి. మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన గుండె గణేష్ ముదిరాజ్



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 5 (వార్తాప్రభ):**బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మియాపూర్ మక్తా మహబూబ్పేట్ డివిజన్ 241 పరిధిలోని పెద్దకుడి చెరువు వద్ద బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుండె గణేష్ ముదిరాజ్ పరిశీలించారు.సీఎంసీ ఏఈ నిఖిల్, సంబంధిత శాఖల సిబ్బందితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, నిమజ్జన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలని గణేష్ ముదిరాజ్ కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జాజేరావు రమేష్, చిన్న, భవానీ శంకర్, కొంచ యాదయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## వార్తా కథనానికి స్పందన.. రతన్ కాలనీలో గడ్డి, చెత్త తొలగింపు

**చిన్నారుల భద్రత దృష్ట్యా వెంటనే చర్యలు.. కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్కు కాలనీవాసుల అభినందనలు**



**షాద్నగర్, అక్టోబర్ 5 :(వార్తా ప్రభ ప్రతినిధి)** షాద్నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు రతన్ కాలనీలో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ పాఠశాల సమీపంలో గడ్డి, చెత్త పేరుకుపోయిన సమస్యపై ఆదివారం ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. 22వ వార్డు కౌన్సిలర్ నడికూడ అనిత రఘునాథ్ యాదవ్ వెంటనే స్పందించి మున్సిపల్ సిబ్బంది, డోజర్ తో గడ్డి, చెత్తను పూర్తిగా తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. పాఠశాల పరిసరాల్లో పాములు, క్రిమికీటకాలతో చిన్నారులకు ప్రమాదం పొంచి ఉందన్న స్థానికుల ఆందోళనపై తక్షణమే చర్యలు తీసుకోవడంపై కాలనీవాసులు కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్ను అభినందించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురాగా స్పందించి పరిష్కరించిన మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్కు మరియు డి.జె.న్యూస్ కు ప్రజలు ధన్యవాదాలు తెలిపింది.

## అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబం5 (వార్తాప్రభ):** పాత జాబితాలో పేరు ఉన్నా కొత్తగా నిర్దేశిత విధానంలో దరఖాస్తు తప్పనిసరి... ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని.. అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలి అని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరం ప్రజావాణి కార్యక్రమంలో వరంగల్- ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో పట్టభద్రులైన ఓటర్లు ఓటరుగా నమోదు చేసుకోవడంపై జిల్లాస్థాయి అధికారులు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్-ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం వెలువరించిన నియమ నిబంధనలు, దరఖాస్తు చేసే విధానం, గడువు, తదితర వివరాలను కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రజావాణి లో పాల్గొన్న అధికారులకు క్లుప్తంగా వివరించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా ఫారం-18 దరఖాస్తులు సమర్పించేలా సహకరించాలని తెలిపారు. 01-11-2023 నాటికి కనీసం 3 సంవత్సరాల డిగ్రీ పూర్తి చేసి అర్హత కలిగిన అభ్యర్థులు ఫామ్-18 దరఖాస్తును ఏఈఆర్ఓ (లేదా) నియమిత అధికారికి సమర్పించాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, అవసరమైన ఇతర పత్రాలను జత చేయాలని సూచించారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్సైట్ సీఈవో తెలంగాణ డాట్ ఎన్ఐసి డాట్ ఇన్ అన్ వెబ్ సైట్ ను సందర్శించవచ్చని తెలిపారు. పట్టభద్రుల ఓటరు జాబితాల నూతన తయారీ ప్రక్రియలో భాగంగా, ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు సైతం నిర్దేశిత విధానం ప్రకారం తిరిగి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పాత ఓటరు జాబితాలో పేరు ఉండటం ఒక్కటే ప్రస్తుత ప్రక్రియలో నమోదుకు సరిపోదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# సుజాతనగర్కు అభివృద్ధి వరాలు

- సుజాతనగర్ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ
- రూ.5.50 కోట్లతో 20, 21, 23 డివిజన్లలో పలు అభివృద్ధి పనులు
- నేడు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా శంకుస్థాపనలు
- కొత్తగూడెం మేయర్ మూడు గణేష్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్, అక్టోబర్ 6 (వార్తాప్రభ ప్రతినిధి):**సుజాతనగర్ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తున్నామని కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్ మూడు గణేష్ తెలిపారు. సోమవారం సుజాతనగర్లోని రజబ్ అలీ భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల రోజువారీ అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, వీధి దీపాలు, పారిశుధ్యం, ప్రయాణికుల సౌకర్యాలు తదితర వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.20, 21, 23 డివిజన్ల పరిధిలో రూ.5.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు నేడు ఉదయం 10 గంటలకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు మేయర్ మూడు గణేష్ తెలిపారు.

**ప్రజల అవసరాలే ప్రాధాన్యం** ప్రాంత అభివృద్ధిలో రహదారులు ప్రధాన పాత్ర పోషిస్తాయని మేయర్ పేర్కొన్నారు. ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు నిత్యం రాకపోకలు సాగించే రహదారులను మెరుగుపరచడంతో పాటు అంతర్గత ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.వర్షాకాలంలో మురుగునీరు నిలిచిపోవడం, డ్రైనేజీ సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్లతో పాటు డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి సదుపాయాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తేనే ప్రజలకు అభివృద్ధి ఫలాలు పూర్తిస్థాయిలో అందుతాయని చెప్పారు.

**విద్యుత్, వీధి దీపాలపై ప్రత్యేక శ్రద్ధ** ప్రజల భద్రతకు, రాత్రివేళ రాకపోకలకు వీధి దీపాలు ఎంతో అవసరమని మేయర్ తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్, వీధి దీపాల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలు, ప్రధాన రహదారులు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

**ప్రయాణికులకు బస్సు షెల్టర్** సుజాతనగర్ ప్రధాన కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ ఏర్పాటు చేయనున్నట్లు మేయర్ వెల్లడించారు. బస్సుల కోసం వేచి ఉండే ప్రజలు ఎండ, వర్షాలకు ఇబ్బంది పడకుండా ఈ సదుపాయం ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పటికే వేపలగడ్డలో బస్సు షెల్టర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సుజాతనగర్ ప్రధాన కేంద్రంలో బస్సు షెల్టర్ ఏర్పాటుతో చుట్టుపక్కల గ్రామాలు, కాలనీల నుంచి వచ్చే ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుందని పేర్కొన్నారు.

**అభివృద్ధితో పాటు సంక్షేమం** అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు చేరేలా చూడాల్సిన అవసరం ఉందని మేయర్ అన్నారు. పేదలు, మహిళలు, వృద్ధులు, అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, వారికి అందాల్సిన ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ప్రజలు సమస్యలు తెలియజేయాలి** డివిజన్ల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని మేయర్ కోరారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వీధి దీపాలు తదితర సమస్యలను ప్రజలు తెలియజేస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలు తమ ప్రాంత సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు అభివృద్ధి పనుల అమలులో భాగస్వాములు కావాలని సూచించారు.

**సుజాతనగర్ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ** సుజాతనగర్ ప్రాంత అభివృద్ధిపై కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించారని మేయర్ మూడు గణేష్ తెలిపారు. ఇప్పటికే గుర్తించిన అభివృద్ధి పనులతో పాటు భవిష్యత్తులో ప్రజలకు అవసరమైన మరిన్ని మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.రూ.5.50 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మేయర్ సూచించారు.

**నాయకుల పాల్గొనడం** పాత్రికేయ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి కోమరి హనుమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్య దస్రు, జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి తాళ్లూరి ధర్మారావు, లావుడియా గోపి, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, సుజాతనగర్ టౌన్ సెక్రటరీ బొడ్డు కేశవరావు, సీపీఐ నాయకులు గడ్డం రాజేందర్, కోమరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ, వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**-డిప్యూటీ కమిషనర్కు కాలనీవాసుల వినతి**



**జీడిమెట్ల, అక్టోబర్ 5, (వార్తాప్రభ) :** కాలనీలలో నెలకొన్న డ్రైనేజీ, వర్షపు నీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతూ దుర్గేష్ ఎస్టేట్లో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్తో పాటు వాటర్ వర్క్స్, ఇంజనీరింగ్, శానిటరీ విభాగాల అధికారులతో కాలనీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ మేరకు సమస్యల తీవ్రతను వివరిస్తూ అధికారులకు లిఖితపూర్వక వినతిపత్రం అందజేశారు.

**బాక్స్ నాలా నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**హెచ్.ఎల్. రాఘవేంద్ర కాలనీ, ఏరోనాటికల్ ఎన్క్లేవ్, ఎస్.ఆర్.డీ.జీ. స్కూల్ పరిసరాలు, రాఘవేంద్ర నగర్ తదితర కాలనీలలో వానాకాలంలో వర్షపు నీరు నిలిచిపోయి, మురుగునీరు రోడ్లపై పారుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చారు. వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా వెంటనే బాక్స్ నాలా నిర్మాణం కోసం అంచనాలు (ఎస్టిమేట్) రూపొందించి, పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని కోరారు. అలాగే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన జరపాలని విజ్ఞప్తి చేశారు. కాలనీవాసుల వినతిపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎల్. రాఘవేంద్ర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్దిరాములు, కార్యదర్శి నగేష్ రెడ్డి, ఏరోనాటికల్ ఎన్క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కీర్తి కనకయ్య, రాఘవేంద్ర నగర్ ప్రతినిధులు సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గృహకల్ప కాలనీ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలి

**-డిప్యూటీ కమిషనర్కు వినతి**




**జగద్గిరిగుట్ట, అక్టోబర్ 5, (వార్తాప్రభ) :** జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప కాలనీలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధర్మారపు అంజన్న సోమవారం మున్సిపల్ డిప్యూటీ కమిషనర్కు వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ప్రధాన ఇబ్బందులను ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**ప్రధాన సమస్యలపై వినతి** కాలనీ ప్రజల అవసరాల నిమిత్తం కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని, శిథిలావస్థకు చేరిన అంతర్గత రహదారుల స్థానంలో నూతన సీసీ రోడ్లు వేయాలని కోరారు. అలాగే స్థానిక పార్కుల అభివృద్ధి పనులను పూర్తి చేయడంతో పాటు ఎన్నికల సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా కాలనీలోనే పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కాలనీలో తీవ్రంగా ఉన్న మురుగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన డ్రైనేజీ నిధులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వినతిపై డిప్యూటీ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశిస్తూ, నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# హైదరాబాద్

## రోడ్లపై చెత్తాచెదారం.. మురికికాలువలకు ప్రక్షాళన!

**పారిశుధ్య పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న మేయర్ మూడు గణేష్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అక్టోబర్ 5 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్: కొత్తగూడెం మున్సిపాలిటీ 21వ డివిజన్లో రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం, మురికికాలువలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మేయర్ మూడు గణేష్ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన దగ్గరుండి పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తూ, పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు మురికికాలువలను శుభ్రం చేయించే చర్యలు చేపట్టారు.ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పారిశుధ్య సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మురుగును తొలగించి రోడ్లపై పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్నారు.ప్రజలకు అసౌకర్యం కలగకుండా చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, మురికికాలువల్లో పూడిక పేరుకుపోకుండా నిరంతరం పర్యవేక్షించాలని మేయర్ అధికారులకు సూచించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా చర్యలు కొనసాగించాలని ఆదేశించారు.ప్రజలు కూడా రోడ్లపై చెత్త వేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని మేయర్ కోరారు

## పేదింటి ఆడపిల్లలకు పెళ్లి కానుకగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం.

**-పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి.. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..**



**తొర్రూరు అక్టోబర్ 05 (వార్తాప్రభ):** పేదింటి ఆడపిల్లలకు పెళ్లి కానుకగా కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకంతో ప్రజల కళ్ళల్లో ఆనందం నింపడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 54 మంది లబ్ధిదారులకు మొత్తం 54,00,864 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులను అందజేసి, వారి కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు అవకాశం కల్పించాలి

**ఓబీసీ ఆత్మీయ సమ్మేళనంలో నేషనల్ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్**



**హైదరాబాద్:అక్టోబర్ 5 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బీసీలకు శాసన మండలి ఎన్నికల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలని నేషనల్ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ కోఆర్డినేషన్ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు.నేషనల్ బీసీ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దశాబ్దాలుగా బలహీన వర్గాలు సామాజిక, రాజకీయంగా వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపులో సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ప్రత్యేకంగా మహబూబ్నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాన్ని బీసీ అభ్యర్థికి కేటాయించే విషయాన్ని అన్ని రాజకీయ పార్టీలు సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా వరంగల్--ఖమ్మం--నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాన్ని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి కేటాయించే అంశాన్ని కూడా రాజకీయ పార్టీలు పరిశీలించాలని దుండ్ర కుమారస్వామి కోరారు.ఎన్నికల సమయంలో బీసీ, ఎస్సీ వర్గాల మద్దతు కోరడమే కాకుండా, శాసన నిర్ణయాలు తీసుకునే వేదికల్లోనూ ఆయా వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు."ప్రాతినిధ్యం కేవలం రాజకీయ అవకాశం కాదు.. అది సామాజిక న్యాయానికి కొలమానం" అని దుండ్ర కుమారస్వామి పేర్కొన్నారు. వివిధ సామాజిక వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే అంశంపై విస్తృతంగా చర్చించి, చారిత్రాత్మకంగా వెనుకబడిన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించేలా నిర్ణయాలు తీసుకోవాలని రాజకీయ పార్టీలను కోరారు.ఈ కార్యక్రమంలో నేషనల్ బీసీ దళ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజేష్ యాదవ్, నేషనల్ బీసీ దళ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## జగన్ ఇమేజ్ ఒకే....లీడర్లు మాత్రం ?

: ఏ రాజకీయ పార్టీకి అయినా సంస్థాగత బలం అతి ముఖ్యం. అది ఎలా వస్తుంది అంటే క్షేత్ర స్థాయిలో నిలబడి పనిచేసే నాయకులు. అలాగే పార్టీకి అతి ముఖ్యం కార్యకర్తలు. అలా అంచెలంచెలుగా పార్టీ నిర్మాణం ఉండాలి. టాప్ టూ బాటమ్ వరకూ విధానాలు నిర్ణయాలు అన్నీ కూడా సరిగ్గా అమలు కావాలంటే నాయకుల పాత్ర ముఖ్యం. ఒక విధంగా క్యాడర్ కి అధినాయకుడికి మధ్యన నాయకులు కీలకంగా వారధిగా ఉంటారు. ఇదంతా గొలుసుకట్టు బంధంగా అందరూ ఉండాలి. ఇందులో ఏ గొలుసు తెగినా లేక గ్యాప్ పెరిగినా కూడా ఇబ్బంది అవుతుంది. వైసీపీ విషయానికి వస్తే ఆ పార్టీకి అధినేతగా జగన్ కి అపారమైన జనాదరణ ఉంది. అదే సమయంలో ఆయన అభిమానులు వైఎస్సార్ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన వారు ఇలా వీరంతా వైసీపీకి కార్యకర్తలుగా బలంగా ఉన్నారు.అయితే కార్యకర్తలు విశేషంగా ఉన్నారు. కానీ అధినాయకుడికీ వారికీ మధ్య అనుసంధానంగా నాయకులు కూడా అవసరం. వైసీపీలో చూస్తే కార్యకర్తల బలం చాలు అన్న విధానం అమలు అవుతోంది అంటున్నారు. నాయకులు ఎవరైనా సరే కాదు అనుకుంటే తేలికగా వదిలేస్తున్నారు. ఒక నాయకుడు ఎమ్మెల్యే స్థాయికి ఎదిగి అయిదేళ్ళ పాటు ప్రజలలో ఉంటూ పనిచేస్తారు. ఆ విధంగా ఆయన నియోజకవర్గం మొత్తం ప్రభావితం చేయగలుగుతారు. అలాంటి నాయకుడు పార్టీని వీడినపుడు ఆయన వెంట ఎంతో కొంతమంది ద్వితీయ తృతీయ శ్రేణి నాయకులు వెళ్లిపోవడం సహజం. అలాగే ఆయన ప్లేస్ ని కూడా భర్తీ చేసుకోవడం ఒకింత శ్రమగానే ఉంటుంది. పైకి మాత్రం నాయకులు పోయినా ఫరవాలేదు, మాకు కార్యకర్తలు ఉన్నారని అంటుంటారు. కానీ ఒక నియోజకవర్గం స్థాయి నాయకుడిని తయారు చేసి జనం మెప్పించేలా చేయడం అన్నది అతి పెద్ద కసరత్తుగానే చూడాలి.ఈ విషయంలో మాత్రం వైసీపీ భిన్నమైన పంథాలోనే పోతోంది అని అంటారు. ఏ రాజకీయ పార్టీలో అయినా అలకలు అసంతృప్తులు అన్నవి సహజం. వాటి మీద ఎవరైనా కాస్తా దూరంగా ఉంటే బుజ్జగింపు ప్రయత్నాలు జరుగుతాయి. వారికి నచ్చ చెప్పి తమ దారిలోకి తెచ్చుకునే విధంగా ఒక ఎక్సర్ సైజ్ అయితే తెర వెనక జరుగుతుంది. దాని కోసం ఒక పటిష్టమైన యంత్రాంగం కూడా ఉంటుంది. వైసీపీ విషయంలో చూస్తే వెళ్ళే వారు వెళ్లని అన్న వైఖరి ఎక్కువగా కనిపిస్తోంది అని అంటారు. నిజమే ఇష్టం లేని వారిని పట్టి ఉంచలేరు. కానీ అన్ని వేళలా బలీయంగా వ్యతిరేకత ఉండకపోవచ్చు. ఎక్కడైనా అలక నుంచి అసంతృప్తిగా మారుతుంది. అక్కడ నుంచి అది కాస్తా ముదిరి అసమ్మతిగా బలపడుతుంది. ఆ మీదట వ్యతిరేకతగా స్థిరపడుతుంది. ఇలా వివిధ దశలుగా మారిన తరువాతనే ఎవరైనా పార్టీని వీడాలని అనుకుంటారు. అందువల్ల మొదటి దశలోనే అంటే అలకల సమయంలోనే దగ్గరకు పిలిచి సమాధానపరిస్తే అక్కడితో ఆ వ్యవహారం పెరిగి పెద్దది కాకుండా ఉంటుంది. దీని కోసమే పార్టీలలో ట్రబుల్ షూటర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటారు. ఏ నాయకుడూ తాను ఉన్న పార్టీ నుంచి బయటకు పోవాలని అంత సులువుగా అనుకోరు. అవకాశవాదులను పక్కన పెడితే పార్టీలో ముందు నుంచి ఉన్న వారు చాలా కాలం ప్రయాణించిన వారు వేరే పార్టీలోకి వెళ్లాలని అక్కడ తమ రాజకీయ జాతకాన్ని పరిశీలించుకోవాలని రిస్క్ అయితే చేయరు. అనివార్యమైన పరిస్థితులు కనుక ఉంటేనే వారు అలా నెట్టబడతారు. మరి వైసీపీలో అలాంటి వాతావరణం ఉందా అన్నది సమీక్షించుకోవాలని అంటున్నారు. ఈ మధ్య కాలంలో చూస్తే వరసగా నియోజకవర్గం స్థాయి నేతలు అంతా పార్టీని వీడిపోతున్నారు. దానికి ప్రత్యర్థి పార్టీల ఆపరేషన్ ఆకర్ష్ అతి పెద్ద ఆయుధంగా ఉంటే వైసీపీలో ఏదో దశలో గ్యాప్ అన్నది ముదరడం వల్లనే ఇలా జరుగుతోంది అని అంటున్నారు. నాయకులను తయారు చేసుకోగలమని అంతా చెబుతారు కానీ అదంత సులువు అయితే కాదు, అలాగని తల ఎగరేసే వారిని ఉంచుకోమని కానీ ఈ రెండింటికీ మధ్యన ఒక అనుసంధానం ఏదో ఉంటుంది. దానిని పట్టుకుంటే వలసల బెడద చాలా వరకూ తగ్గుతుంది అని అంటున్నారు.

## ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 5 :(వార్త ప్రభ ప్రతినిధి)** ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కమిషనర్ ధ్యానచంద్ర నిర్వహించారు. అదే సమయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోనల్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను కూడా ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఫిర్యాదుదారులను కార్యాలయాలకు పదేపదే పిలిపించకుండా, సమస్య తలెత్తిన ప్రాంతానికి అధికారులు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించారు. సమస్యకు గల కారణాలను పూర్తిగా తెలుసుకుని, నిబంధనలకు అనుగుణంగా శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు.పరిష్కరించేందుకు అవకాశం లేని ఫిర్యాదుల విషయంలో, ఏ నిబంధన లేదా ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) ప్రకారం సమస్యను పరిష్కరించలేకపోతున్నారో ఫిర్యాదుదారులకు స్పష్టంగా, అర్థమయ్యే విధంగా తెలియజేయాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజలకు సమాధానం చెప్పే విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 20 ఫిర్యాదులు స్వీకరించారు. వాటిపై సంబంధిత అధికారులకు కమిషనర్ తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు.వీటిలో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించి అక్రమ నిర్మాణాలు, రోడ్ల ఆక్రమణలకు సంబంధించిన 2 ఫిర్యాదులు, ఇంజనీరింగ్ శాఖకు 8, ఎస్టేట్ విభాగానికి 3, రెవెన్యూ శాఖకు 2, యూసీడీ విభాగానికి 3, పబ్లిక్ హెల్త్ శాఖకు సంబంధించి 2 ఫిర్యాదులు అందినట్లు అధికారులు కమిషనర్‌కు వివరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె. శకుంతల, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, చీఫ్ ఇంజనీర్ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, పర్యవేక్షణ ఇంజనీర్ చంద్రశేఖర్, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సిహెచ్. రత్నబాబు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమలో వైసిపి క్షేత్రస్థాయి పర్యటన షురూ

- కూటమి పాలనలో ప్రజా సమస్యల తిరోగమనం - మాజీ మంత్రి వెలంపల్లి
- స్థానిక పోరుకు సిద్ధం, ప్రజా సమస్యలపై యుద్ధం'లో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ధ్వజం





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 5 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో "స్థానిక పోరుకు సిద్ధం -- ప్రజా సమస్యలపై యుద్ధం" కార్యక్రమాన్ని మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీ వెలంపల్లి శ్రీనివాసరావు సోమవారం ఉదయం స్వాతి థియేటర్ వద్ద (పాత 40, నూతన 34వ డివిజన్) ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ ముఖ్య నాయకులతో కలిసి డివిజన్ పరిధిలో పర్యటిస్తూ స్థానిక ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆంజనేయ రెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.పర్యటన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనను తాను 'వాటర్ మ్యాన్' అని గొప్పలు చెప్పుకుంటున్నారే తప్ప, నగరంలో ప్రజలకు కనీసం తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వలేకపోతున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు నీటి కొరత రాకూడదని వాటర్ ట్యాంకులు నిర్మించి సక్రమంగా నీటి సరఫరా చేశామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సరైన నిర్వహణ (మెయింటెనెన్స్) లేకపోవడం, పైపుల లీకేజీలను పట్టించుకోకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నగరంలో పారిశుధ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని, కనీసం మూడు రోజులకొకసారి కూడా చెత్త తీసుకెళ్లే నాథుడే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారని వెలంపల్లి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్పొరేట్ తరహాలో భారీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారే తప్ప, ఆ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న డ్రైన్లు మురుగుతో నిండిపోయి కనీస మెయింటెనెన్స్ లేక దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గతంలో తాము రోడ్లు, డ్రైనేజీలు, పార్కులను అభివృద్ధి చేసి అందిస్తే, ఇప్పుడున్న పాలకులు వాటి నిర్వహణను కూడా గాలికొదిలేశారని దుయ్యబట్టారు.విజయవాడ నగర ప్రజలు కడుతున్న పన్నుల సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాకు మళ్లించుకుంటూ నగరపాలక సంస్థను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతోందని ఆరోపించారు. గతంలో జగన్‌మోహన్ రెడ్డి గారి ప్రభుత్వంలో 010 ద్వారా ఉద్యోగులకు జీతాలు ఇస్తూ అభివృద్ధికి అండగా నిలిస్తే, నేడు ఆ భారాన్ని కార్పొరేషన్‌పై నెట్టడం దుర్మార్గమన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తేనే స్థానిక నిధులు స్థానికంగా ఖర్చవుతాయని, ప్రజల హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు దాటినా అర్హులైన వృద్ధులకు ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయలేదని వెలంపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, గతంలో జగనన్న అందించిన చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాలను నిలిపివేశారని ఆరోపించారు. పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపేశారని, పేదల సంజీవని అయిన 'ఆరోగ్యశ్రీ'ని పూర్తిగా నిర్వీర్యం చేసి ఆస్పత్రుల్లో వైద్యం అందకుండా చేశారని ధ్వజమెత్తారు. దీనివల్ల ప్రజలు సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్‌వోసీల కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.విజయవాడ నగరంతో కూడిన రాజధాని ఉంటేనే ప్రజలు అంగీకరిస్తారని, విజయవాడను నిర్లక్ష్యం చేసి అమరావతిని అభివృద్ధి చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని వెలంపల్లి హెచ్చరించారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మేయర్, కార్పొరేటర్ స్థానాల్లో ఫ్యాన్ గుర్తు అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# రాయలసీమకు నీళ్లు వస్తుంటే వైసీపీకి ఎందుకు ఉలికిపాటు ?

**టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం. ఎస్. బేగ్**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 5 :(వార్త ప్రభ ప్రతినిధి)**రైతుల ప్రయోజనాల కోసం సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్న కూటమి ప్రభుత్వం రాయలసీమ రైతుల దశాబ్దాల సాగునీటి కలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేస్తుంటే వైసీపీ నేతలు అనవసర ఆరోపణలు చేయడం దురదృష్టకరమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎం.ఎస్. బేగ్ అన్నారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు ఎంత ఖర్చు చేశారు ? ఎన్ని ప్రాజెక్టులను పూర్తి చేశారు ? పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఏం చర్యలు తీసుకున్నారు ? అనే విషయాలను జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వం రాబోయే మూడేళ్లలో 36 ప్రాధాన్యతా సాగునీటి ప్రాజెక్టులను సుమారు రూ.35,000 కోట్లతో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. హంద్రీ--నీవా, వెలిగొండ, పోలవరం తదితర కీలక ప్రాజెక్టులను వేగవంతం చేస్తూ రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు .రాయలసీమను కేవలం కరువు ప్రాంతంగా కాకుండా దేశంలోనే ప్రముఖ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసి, సాగునీటితో పాటు ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతుల ద్వారా రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని అని ఎం.ఎస్. బేగ్ తెలిపారు.రైతులకు కావాల్సింది రాజకీయ ఆరోపణలు కాదు, సాగునీరు కావాలి, రాయలసీమకు కావాల్సింది అడ్డంకులు కాదు --- ప్రాజెక్టుల పూర్తిచేయడం, రాయలసీమకు నీళ్లు తెచ్చే ప్రభుత్వానికి అండగా నిలవాలి, నీటి ప్రాజెక్టులను అడ్డుకునే రాజకీయాలకు ప్రజలు చెక్ పెడతారని ఎం.ఎస్. బేగ్ అన్నారు.రాయలసీమకు నీళ్లు తెచ్చేది - వాటర్ మ్యాన్ నారా చంద్రబాబు నాయుడు, అడ్డుకునేది - గొడ్డలి మ్యాన్ జగన్ రెడ్డి. వాటర్ మ్యాన్ కావాలో, గొడ్డలి మ్యాన్ కావాలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారని ఎం.ఎస్. బేగ్ స్పష్టం చేశారు.

# జీవన నైపుణ్యాలతో విజయశిఖరాలు






**విజయవాడ పశ్చిమ అక్టోబరు 5 : (వార్త ప్రభ ప్రతినిధి)** సానుకూల దృక్పథం, సమయ నిర్వహణ, కుటుంబ విలువలు, నిరంతర అభ్యాసం, సమర్థవంతమైన వినే నైపుణ్యాలు వంటి జీవన నైపుణ్యాలను వృద్ధి చేసుకోవటం ద్వారా విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో విజయంసాధించటం తేలిక అవుతుందని ప్రముఖ లైఫ్ స్కిల్ ట్రైనర్ కె.ఎస్. కృష్ణమోహన్ అన్నారు. కె.బి.ఎన్ కళాశాల యుజిసి ఉమెన్స్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం 'పవర్ ఆఫ్ యూత్ : మాస్టరింగ్ లైఫ్ స్కిల్స్ ఫర్ పర్పస్ అండ్ సక్సెస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానవక్తగా పాల్గొన్న కృష్ణమోహన్ మాట్లాడుతూ సానుకూల ఆలోచనలతో రోజును ప్రారంభించాలని, స్క్రీన్ టైమ్‌ను తగ్గించి, ఆ సమయాన్ని కుటుంబ సభ్యులతో గడపడానికి, కొత్త విషయాలను నేర్చుకోవడానికి వినియోగించాలన్నారు. ప్రతి విషయాన్ని సానుకూలమైన విధంగా వివరించడం, మాట్లాడడం అలవాటు చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో ఎదగటానికి లిజనింగ్ స్కిల్స్ (శ్రద్ధగా వినే నైపుణ్యం) ప్రాథమిక అవసరమనీ; ఇతరులు మాట్లాడుతున్నప్పుడు మధ్యలో అడ్డుకోకుండా, శ్రద్ధగా, ఓపికగా వినడం ద్వారా మంచి శ్రోతలుగా మారవచ్చన్నారు. అవతలి వ్యక్తికి తగిన ప్రాధాన్యత ఇవ్వటం, ఇతరుల అభిప్రాయాలను గౌరవిస్తూనే మన ఆలోచనలు వారికి అర్థమయ్యేలా నేర్పుగా మాట్లాడటం నేర్చుకోవాలని సూచించారు. జీవితంలో ఎదగటానికి, అన్నీ కోల్పోవటానికీ -- రెండిటికీ మనం మాట్లాడే మాటలే కారణమవుతాయని, అవతలి వ్యక్తి దగ్గర మన భావాలను పరిపూర్ణంగా వ్యక్తీకరించటానికి మాట్లాడే నైపుణ్యాలు అవసరమన్నారు. వర్తమాన సమాజంలో జరుగుతున్న అనేక సంఘటనలు, ఇతివృత్తాలను ఉదాహరణలుగా తీసుకుంటూ విద్యార్థులు తమ జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలో సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ సిలబస్ తో పాటు లైఫ్ స్కిల్స్ పెంచుకోవటం మీద కూడా విద్యార్థులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఉమెన్స్ స్టడీస్ సెంటర్ సమన్వయకర్త పి.గౌతమీదేవి, జి.సీత, వనమాదేవి, వి.ఎస్.మణి, ఐక్యుఎసి కోఆర్డినేటర్ షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.టి.ఆర్. పోలీస్ కమిషనరేట్‌కు రెండు నూతన స్నిఫ్ఫర్ డాగ్స్

**ఈగల్ టీం కు ఒక నూతన స్నిఫ్ఫర్ డాగ్**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 5 :(వార్త ప్రభ ప్రతినిధి)**ఎన్.టి.ఆర్. పోలీస్ కమీషనరేట్ కు కేటాయించిన రెండు స్నిఫ్ఫర్ డాగ్స్ 23.10.2025 నుండి 02.10.2026 వరకు సుమారు ఒక సంవత్సరం పాటు ప్రత్యేక శిక్షణా కేంద్రంలో సమగ్రమైన విధి నిర్వహణ శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకుని ఎన్.టి.ఆర్.పోలీస్ కమీషనరేట్ కు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో పోలీస్ అధికారులు సదరు డాగ్స్ మరియు వాటి హ్యాండ్లర్లతో కలిసి ఈ రోజు పోలీస్ కమీషనర్ వారి కార్యాలయం నందు నగర పోలీస్ కమిషనర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి సదరు స్నిఫ్ఫర్ డాగ్స్ శిక్షణ వివరాలను వివరించడం జరిగింది.మొదటి స్నిఫ్ఫర్ డాగ్ నైనా ఇది డచ్ షెపర్డ్ జాతికి చెందిన ఫీమేల్ డాగ్, దీనికి హ్యాండ్లర్ గా హెడ్ కానిస్టేబుల్ 412 పీ నాగరాజు గారు వ్యవహరిస్తున్నారు. ఇది ఎక్స్‌ప్లోజివ్ (పేలుడు పదార్థాల తనిఖీ) మరియు ట్రాకింగ్ విభాగాల్లో ప్రత్యేక శిక్షణ పొందింది. అంతేకాకుండా శిక్షణా కేంద్రంలో రాష్ట్ర స్థాయి పోటీలలో రెండవ స్థానం సాధించింది. రెండవ స్నిఫ్ఫర్ డాగ్ లక్కీ ఇది బెల్జియన్ మెలనోయిస్ జాతికి చెందిన ఫీమేల్ డాగ్. హ్యాండ్లర్స్ పీ సీ 2517 బీ ఆర్ బీ రాజు మరియు హెడ్ కానిస్టేబుల్ 328 ఎన్ రామరాజు వ్యవహరిస్తున్నారు, ఇది నార్కోటిక్స్ (మాదకద్రవ్యాల గుర్తింపు) మరియు ట్రాకింగ్ విభాగాలలో ప్రత్యేక శిక్షణ పొందింది. మూడవ స్నిఫ్ఫర్ డాగ్ రాడో ఇది బెల్జియన్ మెలనోయిస్ జాతికి చెందిన మేల్ డాగ్. హ్యాండ్లర్ గా పీ సీ 245 జి అప్పలనాయుడు వ్యవహరిస్తున్నారు, ఇది నార్కోటిక్స్ (మాదకద్రవ్యాల గుర్తింపు) విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందింది. దీనిని ఈగల్ టీం కు కేటాయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ తోపాటు అడ్మిన్ డి.సి.పి. శ్రీమతి కె.జి.వి.సరిత ఐ.పి.ఎస్., డి.సి.పి. లక్ష్మీనారాయణ ఐ.పి.ఎస్., ఎ.ఆర్.డి.సి.పి. సత్యనారాయణ , ఎ.ఆర్.ఎ.డి.సి.పి. రమణ , ఎ.సి.పి. కృష్ణం రాజు , ఆర్.ఐ.లు బి. సంపంగిరావు , సుధాకర్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

'బాల న్యాయ వ్యవస్థ" చట్టం మరియు నియమాల అవగాహన పోస్టర్‌ను

## ఆవిష్కరించిన నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 5 :(వార్త ప్రభ ప్రతినిధి)** నగర పోలీస్ కమీషనర్ వారి కార్యాలయం నందు పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్, అడ్మిన్ డి.సి.పి. శ్రీమతి కె.జి.వి.సరిత ఐ.పి.ఎస్ తో కలిసి సోమవారం ప్రాజెక్ట్ రెస్క్యూ ఫౌండేషన్ వారి సౌజన్యంతో రూపొందించిన "బాల న్యాయ వ్యవస్థ -- పిల్లల సంరక్షణ, రక్షణ చట్టం 2000 మరియు నియమాలు 2003" పోస్టర్ ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బాలురు లేదా బాలికల (జువెనైల్స్) కేసుల్లో పోలీస్ అధికారులు వ్యవహరించాల్సిన తీరు, పాటించాల్సిన నియమ నిబంధనలపై అధికారులు మరియు సిబ్బంది అందరూ స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రాజెక్ట్ రెస్క్యూ ఫౌండేషన్ వారి సౌజన్యంతో ఎన్.టి.ఆర్.పోలీస్ కమీషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులకు రేపు ఉదయం జూమ్ మీటింగ్ ద్వారా "బాల న్యాయ వ్యవస్థ -- పిల్లల సంరక్షణ, రక్షణ చట్టం 2000 మరియు నియమాలు 2003" పై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.పిల్లల హక్కుల పరిరక్షణకు, వారికి సరైన న్యాయం మరియు పునరావాసం కల్పించడానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ఏదైనా అత్యవసర సహాయం లేదా సమాచారం కోసం 100 లేదా చైల్డ్ లైన్ 1098 కు కాల్ చేయాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ తో పాటు, అడ్మిన్ డి.సి.పి. శ్రీమతి కె.జి.వి.సరిత ఐ.పి.ఎస్, ప్రాజెక్ట్ రెస్క్యూ ఫౌండేషన్ డా. మాత్యూవ్ కె.డానియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నవ మల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీ కి దక్కిన ఆదిత్య పిఠాపురం మహారాజా సాహితీ సేవా పురస్కారం



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 5 :(వార్త ప్రభ ప్రతినిధి)** పిఠాపురంలోని ఆదిత్య విద్యాసంస్థలు పాఠశాల ఆవరణలోని ఆడిటోరియంలో పిఠాపురం మహారాజా 141వ జయంతి వేడుకల్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో తొలిసారిగా ఇస్తున్న 'ఆదిత్య పిఠాపురం మహారాజా' సాహితీసేవా పురస్కారాన్ని విజయవాడకు చెందిన మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ వ్యవస్థాపకులు, నవమల్లెతీగ మాసపత్రిక సంపాదకులు కలిమిశ్రీకి అందజేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా పిఠాపురం మున్సిపల్ కమిషనర్ ఎస్.టి.వి రాజేశ్వర రావు, ఆదిత్య విద్య సంస్థల డైరెక్టర్ శ్రీమతి ఎన్ శృతి రెడ్డి, సుప్రసిద్ధ సాహితీవేత్తలు ర్యాలీ ప్రసాద్, ఉండవల్లి యం, ప్రిన్సిపల్ విజయ సారథి తదితరులు పాల్గొన్నారు.కాగా రాష్ట్రంలో తొలి సారిగా శ్రీకారం శుట్టిన ఆదిత్య పిఠాపురం మహా రాజా సాహితీ సేవా పురస్కారంకి తనని అర్హునిగా ఎంపిక చేసిన నిర్వాహకులకు పురష్కార గ్రహీత కలిమిశ్రీ కృతజ్ఞతలు తెలిపారు.

## పజ్జూరు నవ సాత్విక్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం





**రెడ్డిగూడెం అక్టోబర్, 5(వార్తాప్రభ ప్రతినిధి ):**ఎన్టీఆర్ జిల్లా, రెడ్డి గూడెం మండలం, తాడిగూడెం గ్రామ రైస్ మిల్లు పజ్జూరు సతీష్ తల్లి కనకదుర్గ ఆశీస్సులతో తన మనవడు పజ్జూరు నవ సాత్విక్ 11 వ జన్మదిన వేడుకలు రెడ్డిగూడెంలో తూర్పు గూడెం నందు అభ్యుదయ యువశక్తి సంఘం వారి వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించినారు. ఈ అన్నదానానికి సంఘం వారిఆహ్వానంతో.. వృద్ధాశ్రమంలోనికి ముఖ్యఅతిథిగా రెడ్డిగూడెం మండల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీను పాల్గొని, వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులు, వికలాంగులను ప్రేమతో పలకరించి , వారి యోగక్షేమాలు తెలుసుకొని సమాజంలో ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు వేడుకలు వృద్ధాశ్రమంలో జరుపుకొనుట దైవ సన్నిధిలో దేవుని దీవెనలు పొందటమనీ, ఈరోజు వృద్ధులు వికలాంగుల పట్ల సానుభూతితో సాత్వికం కలిగి ఒక పూట భోజనం అందించిన పజ్జూరు నవ సాత్వికుకు తన ఆశీస్సులు అందజేసి, తదుపరి ఎస్సై శ్రీను తమ చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు. చివరిగా.. వృద్ధాశ్రమంలో ఉన్న వారందరూనవ సాత్విక్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ యువ శక్తి సంఘం అధ్యక్షులు చింతిరాల. వెంకటేశ్వరరావు, సంఘ సెక్రటరీ చింతిరాల. సావిత్రి కౌశాధికారి తాళ్లూరు ఝాన్సీ , కంచర్ల రామారావుతదితరులు పాల్గొన్నారు

# సాటిలేని మేటి అమ్మ

అమ్మలోని త్యాగగుణము
అమితమైన అనురాగము
ఆమెలోనే సాధ్యము
ఆదరించు మేలిగుణము
అపారమైన సహనము
అమ్మకదే ఆభరణము
మాతృమూర్తి సదనంలో
తారకమ్మ గగనంలో
అమ్మకు అమ్మే సాటి
లేరు ఎవ్వరూ పోటీ
సదనానికి సింగారము
ఆమె మనసు బంగారము
పువ్వులాగ మెత్తదనము
వెన్న వోలె నవనీతము
అమ్మ మంచి హృదయము



భగవంతుని ఆలయము

--గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# 20 రోజులుగా కొనసాగుతున్న వీఆర్ఏల నిరసన



**హనుమాన్ జంక్షన్, అక్టోబర్ 5(వార్తాప్రభ)** తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ బాపులపాడు మండలానికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) చేపట్టిన ఆందోళన 20వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించకపోవడంతో వీఆర్ఏలు అసంతృప్తి వ్యక్తం చేశారు.తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వెంటనే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేసి తదుపరి కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. తమ హక్కుల సాధన కోసం ఎంతకాలమైనా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.వీఆర్ఏల ఆందోళనకు ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని బాపులపాడు మండల అధ్యక్షుడు గండేపూడి వీరయ్య, కార్యదర్శి ఇలపర్తి కోటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో చలపాక రుషి, వెంకటరత్నం, రమేష్, వనజతో పాటు పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు.

# విస్సన్నపేట ఓపెన్ జిమ్ ఎనీ టైం బిజీ బిజీ





**విస్సన్నపేట అక్టోబర్ 5 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కూటమి ప్రభుత్వ పరిపాలనలో సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే లక్ష్యంగా కోనేరు కట్టను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు 300 ఫల పుష్ప ఔషధ మొక్కలను తిరువూరు ఏఎంసీ వైస్ చైర్మన్ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు వైభవ్ జ్యూయలరీ అధినేత కె.వి నాగేశ్వరరావు అందించడం జరిగింది. అదే సమయంలో శ్రీ శ్రీనివాస సిటీకేబుల్ అధినేత కర్నాటి శ్రీనివాస చక్రవర్తి రెండు టన్నులున్నర నాచు తెప్పించి గ్రీనరీ పెంచేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలుస్తోంది. పశువులు వాకింగ్ ట్రాక్టర్ పైకి రాకుండా కంచి వేసేందుకు ఎన్ఆర్ఐ వల్లభనేని గిరిబాబు 3 లక్షల రూపాయలను అందించడం మహోన్నత వరంగా చెప్పుకుంటున్నారు. కాంట్రాక్టర్ లలితా సూపర్ బజార్ పార్ట్నర్ కే రామకృష్ణ మేలిరకం వస్తువులను వాడటం కొసమెరుపుగా చెప్పుకోవచ్చు. ఎంపీడీవో సిహెచ్ చిన్న రాట్నాలు కోనేరును స్వచ్ఛ కోనేరుగా మార్చేందుకు పతక రచన చేయటం శంకుస్థాపన రాయనుండి పరిసర ప్రాంత రియల్ ఎస్టేట్ వెంచర్ల దశ మారిందని సర్వత్రా వినిపిస్తుంది.సూర్యోదయ సమయం నుండి రాత్రి సోలార్ లైట్ల వెలుగులలో వందలాదిమంది వాకింగ్ ట్రాకర్ పై తమ ఆరోగ్యాన్ని మహాభాగ్యంగా పెంపొందించుకునేందుకు వాకింగ్ చేస్తూ ఉంటే సాయం సమయంలో విద్యార్థిని విద్యార్థులు యువత ముఖ్యంగా మహిళలు వృద్ధులు ఓపెన్ జిమ్ వినియోగంలో బిజీబిజీగా ఉండటం విస్సన్నపేటకి మోడల్ ఐకాన్ గా కోనేరు సెంటర్ నిర్మాణ సమయంలోనే గుర్తింపురావడం అధికారులకు మంచి పేరు వచ్చిందని అందులో అనుకుంటున్నారు.

## చిన నందిగామ,గంగినేనిపాలెం గ్రామాలలో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ



**జి.కొండూరు: అక్టోబర్ 5 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్ట్ లో భాగంగా జి.కొండూరు మండల పరిధిలోని చిన నందిగామ,గంగినేనిపాలెం,పెట్రంపాడు గ్రామాలలో తహశీల్దార్ డి.రిబ్కారాణి ఆధ్వర్యం లో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ షేక్ షీమా బేగం పర్యవేక్షణలో టీడీపీ మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేములకొండ వెంకటేశ్వర రావు,లంక నాగేశ్వరరావు ఆయా గ్రామలలోని పార్టీ నాయకులతో కలిసి సోమవారం రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు.చిన నందిగామ, గంగినేనిపాలెం ,పెట్రంపాడు గ్రామాల లో నిర్వహించిన రీ-సర్వే ప్రక్రియలో భాగంగా పలువురు పట్టాదారులకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయడం జరిగిందని వెంకటేశ్వరరావు తెలిపారు.తహశీల్దార్ రిబ్కా రాణి మాట్లాడుతూ పెట్రంపాడు లో 319 పాస్ పుస్తకాలు మంజూరు కావాల్సి ఉండగా 317 మంజూరు అయ్యాయని, రెండు పెండింగ్ ఉన్నట్లు తెలిపారు.గంగినేనిపాలెం గ్రామానికి సంబంధించి 452 పట్టాదారు పాస్ పుస్తకాలకు గాను 451 మంజూరు అయ్యాయని ఇంకా ఒకటి పెండింగ్ ఉందని అలాగే చిన నందిగామ గ్రామానికి సంబంధించి 1022 పట్టాదారు పాస్ పుస్తకాలకు 1022 మంజూరు అయ్యాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వి.మణిందర్ సింగ్, ఏఎంసీ మాజీ చైర్మన్ వుయ్యూరు వెంకట నరసింహారా వు,చిన నందిగామ గ్రామ మాజీ సర్పంచ్ ధనేకుల శ్రీకాంత్, బసవేశ్వర రావు, ఉప్పు వెంకటేశ్వర్లు, గంగినేనిపాలెం గ్రామ మాజీ సర్పంచ్ మంగళంపాటి వెంకటేశ్వరరావు,ఆ గ్రామాల వీఆర్వో లు,వి ఆర్ ఏ లు, రైతులు పాల్గొన్నారు.

# డీఈఓ శంభు ప్రసాద్‌కు ఘన సన్మానం

● ప్రైవేటు విద్యాసంస్థల సమస్యలపై వినతిపత్రం అందజేత ● సానుకూలంగా స్పందించిన డీఈఓ.. జిల్లా విద్యాశాఖను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు అందరి సహకారం అవసరం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అక్టోబర్ 5 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం టౌన్,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)గా బాధ్యతలు స్వీకరించిన శంభు ప్రసాద్‌ను తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ప్రైవేటు విద్యాసంస్థలకు సంబంధించిన సమస్యలను పరిశీలించి, నిబంధనల పరిధిలో సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని డీఈఓ శంభు ప్రసాద్ హామీ ఇచ్చినట్లు ట్రస్మా నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా డీఈఓ శంభు ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖను మరింత బలోపేతం చేసి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు, ఉపాధ్యాయులు, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజల సహకారం అవసరమని అన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించడంతో పాటు విద్యారంగ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బండి లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి భాగం విజయకుమార్, కోశాధికారి మధుసూదన్ రెడ్డి, జోనల్ సార్ శ్రీధర్ రెడ్డి, కిషోర్, చైతన్య, వరప్రసాద్, డాక్టర్ బి.ఎన్.ఆర్., రమేష్, మణికంఠ, చక్రధర్, కోటిరెడ్డి, రాంబాబు, సురేష్, నరసింహారావు, కవిత, పి. రమేష్, కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ నగరపాలక సంస్థకు జిల్లా పరిధిలో మూడు స్వచ్ఛ అవార్డులు




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 5 :(వార్త ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా పరిధిలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ వర్ల రామయ్య, 20 పాయింట్స్ చైర్మన్ లంకా దినకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఎన్టీఆర్ జిల్లా పరిధిలో వివిధ విభాగాల్లో స్వచ్ఛతకు సంబంధించి అవార్డులను ప్రదానం చేయగా, విజయవాడ నగరపాలక సంస్థకు మూడు విభాగాల్లో అవార్డులు లభించాయి.స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయం కేటగిరీలో విజయవాడ నగరపాలక సంస్థ అవార్డును అందుకుంది. స్వచ్ఛ పార్క్ మరియు అర్బన్ గ్రీన్ స్పేస్ కేటగిరీలో విజయవాడలోని రాజీవ్ గాంధీ పార్క్ అవార్డును సొంతం చేసుకుంది. బెస్ట్ స్వచ్ఛత వారియర్స్ కేటగిరీలో విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు పి. విల్సన్ రాజు, సిహెచ్. మణి అవార్డులను అందుకున్నారు.ఈ సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాల అమలులో విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న నిరంతర కృషికి ఈ అవార్డులు గుర్తింపుగా నిలుస్తాయని తెలిపారు. నగరాన్ని మరింత పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన నగరంగా తీర్చిదిద్దేందుకు ఇదే స్ఫూర్తితో మరింత కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ జనరల్ ఏ. రవీంద్రరావు, అడిషనల్ కమిషనర్ కె. శకుంతల, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. నిర్మల గ్లోరీ, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, జోనల్ కమిషనర్లు శ్రీనివాస్, కె. ప్రభుదాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాలకృష్ణమూర్తి, డిప్యూటీ ప్లానర్ చంద్రబోస్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు మోహన్ బాబు, అసిస్టెంట్ కమిషనర్లు ఏ.యు.బి. శర్మ, హెలెన్ ప్రభావతి, సీడీవోలు శ్రీకాంత్, జగదీశ్వరి, ఉమామహేశ్వరి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చెత్త రహిత గ్రామాలుగా మార్చుటకు దసరా ధమాకా.

**- ఎంపిడివో శ్రీను ప్రకటన**



**.పెనుగంచిప్రోలు - అక్టోబర్ 5( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండలం లోని అన్ని గ్రామాలను చెత్త రహిత గ్రామాలుగా మార్చుటకు ప్రభుత్వ సూచనల ప్రకారం ప్రజలను ఉత్తేజ పరుచుటకు గాను పెనుగంచిప్రోలు మండల పరిషత్ ద్వారా గ్రామాలలో తిరిగే స్వచ్ఛ రథం ద్వారా సేకరించే పొడి చెత్త ఉదాహరణ ప్లాస్టిక్ వస్తువులు, పాత పుస్తకాలు, అట్టలు మొదలైన వాటిని దసరా సందర్భంగా దసరా ధమాకా పేరు కొత్త స్కీమ్ ను ఎంపీడీవో శ్రీమతి శ్రీను ప్రకటించారు.ఈ నెల 22 వ తేదీ వరకు ఏ కుటుంబము అయితే 10 కేజీ ల పైన పొడి చెత్త అనగా పైన తెలిపినవి స్వచ్ఛ రథం నిర్వాహకునికి ఇస్తారో వారికి వాటి విలువకు సరిపడే డబ్బులు ఇస్తారు,అలాగే ఒక కూపన్ కూడా ఇస్తారని మండల ఎంపిడివో శ్రీమతి జీ. శ్రీను తెలిపారు అలాగే దసరా పండుగ సందర్భంగా ఈ నెల 22వ తేదీ కూపన్లు ఇచ్చిన వారికి మండల పరిషత్ కార్యాలయం లో లాటరీ తీసి ముగ్గురికి పై తెలిపిన బహు మతులు ఇవ్వబడును అని ఎంపిడివో తెలిపారు...

# రాష్ట్ర స్థాయి రెడ్ క్రాస్ శిక్షణకు టి జె పి యస్ కళాశాల విద్యార్థులు ఎంపిక



**గుంటూరు, అక్టోబర్ 5 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఈ నెల 14 వ తేది నుండి 16 వ తేది వరకు చిత్తూరు లో జరిగేటువంటి రాష్ట్ర స్థాయి రెడ్ క్రాస్ శిక్షణ శిబిరానికి టి జె పి యస్ కళాశాల కె వైష్ణవి భాయి, ఎస్కే పర్వీన్, పి సిద్ధార్థ ప్రణవశాస్త్రి, పి షణ్ముఖ ప్రసాద్ శర్మ విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి వి హెచ్ కామేశ్వర శాస్త్రి పేర్కొన్నారు.వీరు మాట్లాడుతూ ఈ శిక్షణ లో ప్రథమ చికిత్స, విపత్తుల నిర్వహణ, ఆరోగ్యం పరిశుభ్రత, సామాజిక సేవ,రోడ్డు భద్రత, సామాజిక సేవ భావాలు, నాయకత్వ లక్షణాలు, అభివ్యక్తి నైపుణ్యాలు మరియు రక్తదానంపై అవగాహన వంటి వాటి గురించి పూర్తి శిక్షణ ఉంటుందని చెప్పారు. గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం నోడల్ అధికారి డాక్టర్ జై వి సుధీర్ కుమార్ మాట్లాడుతూ నేటి యువత విద్యతో పాటు సామాజిక అంశాల వంటి వాటిలో చురుకుగా పాల్గొనడం ఎంతో ముదావహమని చెప్పారు. రాష్ట్రస్థాయి రెడ్ క్రాస్ శిబిరానికి ఎంపికైన కళాశాల విద్యార్థులను సెక్రటరీ ఢ కరస్పాండెంట్ కె.వి బ్రహ్మం అభినందించారు.

# ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కేంద్రం ప్రారంభం

**అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి**
**యువత ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలి: డాక్టర్ గడల శ్రీనివాసరావు**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా।అక్టోబర్ 5 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కొత్తగూడెం, అక్టోబర్ 5: ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన గ్రాడ్యుయేట్లకు ఓటర్ నమోదులో సహకారం అందించేందుకు చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో ఓటర్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా యువత ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా భాగస్వాములు కావాలని, తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు.విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఓటర్ నమోదుకు సంబంధించిన సమాచారం, అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఐ.టి.ఐ.లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**గుడివాడ అక్టోబర్ 5 :(వార్తా ప్రభ ప్రతినిధి):** పట్టణంలోని చౌదరి పేటలో ఉన్న కె.బి.ఆర్. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) ను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంస్థలో విద్యార్థులకు అందుతున్న సాంకేతిక శిక్షణ, వర్క్‌షాప్‌లు, ప్రయోగశాలలు, తరగతి గదులు, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ప్రాక్టికల్ శిక్షణ, అందుబాటులో ఉన్న పరికరాలు, వాటి వినియోగం, శిక్షణా విధానాలపై సంబంధిత అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పారిశ్రామిక రంగ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలతో కూడిన ప్రాక్టికల్ శిక్షణ అందించాలని కలెక్టర్ సూచించారు. ఐటీఐలో శిక్షణ పొందుతున్న యువతకు శిక్షణ అనంతరం మెరుగైన ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు లభించేలా పరిశ్రమలతో సమన్వయం పెంచుకోవాలని అధికారులకు సూచించారు. సంస్థలో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, తరగతి గదులు, వర్క్‌షాప్‌ల నిర్వహణ తదితర అంశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు సురక్షితమైన, అనుకూలమైన శిక్షణా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, కె.బి.ఆర్. ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, బోధన మరియు బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొండపల్లి అభివృద్ధే లక్ష్యం

**చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు**
**55 లక్షల 50 లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన చైర్మన్**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 05(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి మున్సిపాలిటీ లోని ఇబ్రహీంపట్నం లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన సోమవారం శంకుస్థాపన చేశారు. మొత్తం సుమారు 55 లక్షల 50 వేల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా 14 లక్షల 60 వేల రూపాయలతో 19 వార్డులో డ్రైనేజీ నిర్మాణం, 18వ వార్డులో 7 లక్షల రూపాయలతో మూడు కల్వర్టుల నిర్మాణం, ఎస్సీ స్మశాన వాటిక అభివృద్ధికి 27 లక్షలు, ముస్లిం ఖబరస్థాన్ అభివృద్ధికి 11 లక్షల 35 వేల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేయనున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పాలకమండలి ఏర్పడిన తర్వాత స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ సహకారంతో కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా తీసుకు వెళుతున్నామని తెలిపారు. మౌలిక సదుపాయాలు కల్పనకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా సోమవారం 55 లక్షల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, టిడిపి కస్టర్ ఇంచార్జ్ మరియు కౌన్సిలర్ చనుమోలు నారాయణరావు, కో- ఆప్షన్ సభ్యులు మహబూబ్ సుభాని, సైదులు, కూచిపూడి దిలీప్,పులి దాసు, టిడిపి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# క్రీడలతో ఆత్మ విశ్వాసం





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 5 :(వార్త ప్రభ ప్రతినిధి)** క్రీడలతో ఆత్మవిశ్వాసంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించబడతాయని వ్యక్తిత్వ వికాస నిపుణుడు జీ సీతారాం కేసరి అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఈసీఈ ఆధ్వర్యంలో 'అన్‌లాకింగ్ యువర్ పొటాన్షియల్ ఇన్ స్పోర్ట్స్' అంశంపై ఆ కళాశాల సెమినార్ హాల్‌లో సోమవారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన జీ సీతారాంకేసవి మాట్లాడుతూ క్రమశిక్షణ, ఏకాగ్రత, జట్టుగా పని చేసే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు వ్యక్తిత్వ వికాసాన్ని పెంచటంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. క్రీడల్లో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా స్వీకరించటం ద్వారా వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవటానికి, లక్ష్యాసాధన దిశగా అడుగులు వేయటానికి అవకాశముంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడలపైనా పట్టు సాధించాలని సూచించారు. క్రీడల్లో రాణించటం ద్వారా పట్టుదల వంటి అంశాలను పెంపొందించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ వీ షణ్ముఖరావు, అధ్యాపకులు పీ సంజయ్‌కృష్ణమాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగిరిపల్లి విద్యుత్ శాఖ ఏఈగా నాగేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



**ఆగిరిపల్లి, అక్టోబర్ 5 (వార్తా ప్రభ దినపత్రిక):** ఆగిరిపల్లి విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా నాగేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నందిగామ నుంచి ఆయన ఆగిరిపల్లి ఏఈగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సబ్ ఇంజనీర్, లైన్ ఇన్‌స్పెక్టర్, దాసరి రాంబాబు, ఆగిరిపల్లి లైన్మెన్ సింహాద్రి శోభన్ బాబు, జనార్ధన్,లైన్‌మెన్లు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఏఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని చెప్పారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు.

## వైభవంగా గౌస్ మొహిద్దిన్ గంధ మహోత్సవం



**అనుమసముద్రంపేట అక్టోబర్ 05 (వార్తాప్రభ)** మండల కేంద్రమైన ఏఎస్ పేటలో ఉన్న దర్గా సజ్జాదానషీన్ షా గులాం నక్ష బంద్ హఫీజ్ పాషా తండ్రి దర్గా మాజీ పీఠాధిపతి షాగులాం గౌస్ మొహిద్దిన్ ఏడవ గంధ మహోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహల్ లోని సజ్జాదానషీన్ హాఫీజ్ పాషా ఇంటి నుంచి గంధ కలశాన్ని గలేఫ్ వస్త్రాలు పూల దుప్పట్లను మేళ తాళాలుతో బాణాసంచా కాల్చుతూ పకీర్ల జరాబులు నడుమ ఊరేగింపుగా దర్గా వరకు తీసుకువెళ్లారు.ఈ సందర్భంగా షాగులాం గౌస్ మొహిద్దిన్ సమాధి,పై గంధాన్ని పూసి గలీఫ్ వస్త్రాలు పూల దుప్పట్లు కప్పి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.ఈ మేరకు తొలుత దర్గా లోపల ఉన్న శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ దొరసానమ్మల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు షాగులాం జునైద్ పాషా ఉస్మాన్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇనామ్ రైతు హక్కులను కాపాడండి

- జీవో నంబర్ 16/2013ను రద్దు చేయాలి
- పట్టాదారులైన భూ బాధితులకు తమ భూములపై సర్వహక్కులు కల్పించాలి
- ఆర్డిఓకు వినతి పత్రాన్ని అందజేసిన ఈనాం భూ బాధితులు



**నందిగామ,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** సర్వీస్ ఇనాం రైతు వారిపట్టా హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నందిగామ ఆర్డిఓ కమిటీ అధ్యక్షులు రాటకొండ కోటేశ్వరరావు మరియు అధ్యక్షులు / కొత్తా కోటేశ్వర రావు, కాపు రవీంద్రనాథ్, రాయపాటి రమేష్, మండవ పిచ్చయ్య ల ఆధ్వర్యం లో ఈనాం బాధితులు అర్జీలు ఇవ్వటం జరిగింది. ఈ సమస్య తప్పక పరిష్కరిస్తామని, ప్రభుత్వం కూడా సానుకూలం గా ఉందని తమ అధికారులకు విషయాన్ని తెలియజేస్తామని చెప్పారు. తదనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను కలిసి బాధితులు వారి సమస్యలను తెలియచేయటం జరిగింది. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలియ జేశారు. జీవో నంబర్ 16/2013ను రద్దు చేయాలని, అసలైన పట్టాదారులైన భూ బాధితులకు తమ భూములపై సర్వహక్కులు కల్పించాలని కోరారు. అలాగే 1956 ఇనాం అబాలిషన్ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 2019లో తీసుకువచ్చిన ఆర్డినెన్స్ కేవలం కంటితుడుపు చర్యగా మాత్రమే ఉందని పలువురు పేర్కొన్నారు. సర్వీస్ ఇనాం భూములపై సంబంధిత రైతులకు పూర్తి హక్కులు కల్పించాలనివారు కోరారు.

# రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన ఆదిత్య శ్రీనగర్ పాఠశాల విద్యార్థులు



**కాకినాడ, అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** కాకినాడలోని స్థానిక ఆదిత్య శ్రీనగర్ పాఠశాల విద్యార్థులు క్రీడా పోటీల్లో సత్తా చాటారు. ఎస్జీ ఎఫ్ఐ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా ప్రాంగణంలో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 3 వరకు నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో శ్రీనగర్ ఆదిత్య పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. టైక్వాండో, బాక్సింగ్, రగ్బీ, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. టైక్వాండోలో శ్రీ సాయి చైతన్య తంగేటి, చేతన్ నాగశ్రీహర్ష తంగేటి, రామ్ ప్రసన్న కుమార్ రెడ్డి సరగడ బంగారు పతకాలు సాధించారు. సత్య నిరేక్ కడలి 110 మీటర్స్ హర్డిల్స్లో రజత పతకం సాధించారు. బాక్సింగ్లో తమన్ రిషికేష్ చలపాక, రెజ్లింగ్లో చెల్సి సోఫియా చక్కా, సుహాన్ చాంద్ రిషి చక్కా, వెయిట్ లిఫ్టింగ్ జశ్వంత్ వెంకట్ కనకాల బంగారు పతకం, రగ్బీలో శ్రీసాహితి పితా, ప్రతిభకొల్లి, సనత్ ఏనుగుల, రిషివర్మ పాలెపు రాష్ట్రస్థాయి ఎంపికల్లో నిలిచారు. విద్యార్థుల విజయాల పట్ల ఆదిత్య విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, పాఠశాలల డైరెక్టర్ నల్లమిల్లి శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ టి. రమేష్, వైస్ ప్రిన్సిపాల్ విజయ ఉమాపతి మరియు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. చదువుతో పాటూ క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఆదిత్య శ్రీనగర్ క్రీడా విభాగాన్ని వారు అభినందించారు.

# డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం..



**విజయవాడ,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** సెంట్రల్ నియోజకవర్గం సెంట్రల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బోండా ఉమామహేశ్వర రావు ఆశీస్సులతో డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. 350 మందికి పైగా ఆకలితో ఉన్నవారికి ఆకలి తీర్చజరిగింది. "ఆంధ్రుల అన్నపూర్ణ" డొక్కా సీతమ్మ ని ఇన్స్పిరేషన్ గా తీసుకొని మేము చేస్తున్న ఈ అన్నదాన కార్యక్రమం భావితరాల వారికి డొక్కా సీతమ్మ గురించి తెలియాలని ఆవిడ చేసిన ఎన్నో గొప్ప సేవా కార్యక్రమాలు తెలుసుకోవాలని మన కూటమి నాయకులు మన గురించి కాదు మనకి స్ఫూర్తిదాతలుగా ఉన్న నాయకుల పేర్లు మాత్రమే ముందుండాలని వాళ్ళ పేరు మీదే ఏ కార్యక్రమ జరగాలని చెప్పటం తమ మనసుకి ఎంతో సంతోషాన్ని చ్చిందనీ నిర్వాహకులు అవుటుపల్లి విజయకుమారీ పేర్కొన్నారు. అందువల్లే ఆ డొక్క సీతమ్మ పేరు మీద ప్రతినెల వందలాది మందికి అన్నదాన కార్యక్రమం గవర్నమెంట్ హాస్పిటల్ లో పైపుల్ రోడ్ సెంటర్లో నూ నిర్వహిస్తున్నా, ఎంతోమంది ఆకలి తెలుస్తుందనీ డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు అవుటుపల్లి విజయ కుమారి చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేసారు. నాకు సహకరిస్తూ తను మంచి కార్యక్రమాలు చేయడానికి ప్రోత్సహిస్తున్న దాతలకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# సూర్య ఘర్ పై అవగాహన సదస్సులు - 6 నుండి 8 వరకు..

**గుడివాడ,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పించేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సేవా సేతు అభియాన్ నిర్వహిస్తున్నట్లు ఈఈ జీపీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 6, 7, 8 తేదీలలో కొత్త మున్సిపల్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరగనుందని ఆయన తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగం, ప్రభుత్వం అందించే రాయితీ, బ్యాంక్ లోన్ సదుపాయం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. గుడివాడ పట్టణం, గుడివాడ రూరల్, నందివాడ మండలాలకు చెందిన విద్యుత్ అధికారులు, సోలార్ కంపెనీ ప్రతినిధులు, బ్యాంక్ అధికారులు పాల్గొని సూర్య ఘర్ పథకం ద్వారా లభించే ప్రయోజనాలను వివరిస్తారన్నారు. అక్కడికక్కడే స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సోలార్ ఏర్పాటు చేసుకుని భావితరాలకు వెలుగులు పంచేలా సహకరించాలని ఈఈ శ్రీనివాసరావు కోరారు.

# అగ్రీప్రెన్యూర్‌షిప్, ఆధునిక సాంకేతికతపై ప్రత్యేక దృష్టి

- జిల్లా సామర్థ్యాలకు అనుగుణంగా ఆర్థిక వృద్ధికి అడుగులు..
- అమరావతి ఎకనమిక్ రీజియన్‌లో కీలకపాత్ర పోషించనున్న ఎన్‌టీఆర్ జిల్లా
- అన్ని శాఖల్లో సామర్థ్యాల సద్వినియోగం అత్యంత కీలకం
- ప్రణాళిక రూపకల్పన సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో అమరావతి ఎకనమిక్ రీజియన్ (ఏఈఆర్) కీలకపాత్ర పోషించనుందని.. పారిశ్రామిక రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అమరావతి ఎకనమిక్ రీజియన్‌లో ఎన్‌టీఆర్ జిల్లా చురుకైన పాత్ర పోషించగలదని ఆకాంక్షించారు. నవ్య రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే కాకుండా, దానిచుట్టూ ఉన్న జిల్లాలను అనుసంధానిస్తూ అమరావతి ఎకనామిక్ రీజియన్ పేరుతో భారీ ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన ప్రణాళికల రూపకల్పనలో భాగంగా మేధోమథన చర్చలు, వర్క్‌షాప్‌లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో ఏఈఆర్ ప్రణాళికపై జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఇందులో ఎల్ఈఏ అసోసియేట్స్ (ఏఈఆర్‌పీ) బృంద సభ్యులతో పాటు ప్రణాళిక, పరిశ్రమలు, ఏపీఐఐసీ, వ్యవసాయం, అనుబంధ రంగాలు తదితర శాఖల అధికారులు హాజరుకాగా ఎన్‌టీఆర్, కృష్ణా, పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల, మార్కాపురం జిల్లాలతో కూడిన అమరావతి ఎకనమిక్ రీజియన్ ప్రణాళిక రూపకల్పనలో భాగంగా ఎన్‌టీఆర్ జిల్లాలో సుస్థిర ఆర్థిక వృద్ధికి ఉన్న కీలక అవకాశాలపై చర్చించారు. హైటెక్ వ్యవసాయంతో పాటు క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతికత అనుబంధ వృద్ధికీ అవకాశముందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. జిల్లాలో సేవా రంగం ఆర్థిక రంగంలో కీలకపాత్ర పోషిస్తోందని.. తొలి సవరించిన అంచనాల ప్రకారం వర్తమాన ధరల వద్ద 2024-25 జీవీఏలో వ్యవసాయ రంగం వాటా 12 శాతం, పారిశ్రామికరంగం వాటా 21 శాతం కాగా సేవా రంగం వాటా 67 శాతంగా ఉందన్నారు. జిల్లాలో నేచురల్ ఫార్మింగ్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ అభివృద్ధికీ పుష్కల అవకాశాలున్నాయన్నారు. ఇప్పటికే జిల్లాలో 40 వేల మందికి పైగా ప్రకృతి సేద్యాన్ని అనుసరిస్తున్నట్లు వివరించారు. ఏడు నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చురుగ్గా అడుగులు పడుతున్నాయన్నారు. ఇన్వెస్టర్స్ డెస్క్, ల్యాండ్ బ్యాంకు చొరవతో పెద్దఎత్తున పెట్టుబడులను కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఐటీ, ఐటీఈఎస్ భవిష్యత్తు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాల వృద్ధికి మరింత చొరవ చూపాల్సిన అవసరముందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న పరిశ్రమలు, ప్రతిపాదిత ప్రాజెక్టులు, జిల్లా దార్శనిక ప్రణాళిక, సామాజిక ఆర్థిక నివేదిక, విపత్తు నిర్వహణ ప్రణాళికపైనా చర్చించారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, ప్రైవేటు రంగ భాగస్వామ్యం, స్థానిక వనరుల సమర్థ వినియోగం ద్వారా సుస్థిరమైన, సమగ్ర ఆర్థిక వృద్ధికి బాటలు వేయవచ్చని తద్వారా ఏఈఆర్‌లో కీలక ప్రాంతంగా జిల్లాను నిలబెట్టవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, సీపీవో వై.శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దేశాయిపేట టిడ్కో కాలనీలో ఉచిత వైద్య శిబిరం
















**మచిలీపట్నం,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** స్థానిక టిడ్కో కాలనీ, గో సంఘం దేశాయిపేట నందు దావతే ఇస్లామీ ఇండియా వారి గరీబ్ నవాజ్ రిలీఫ్ ఫౌండేషన్ (GNRF) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్యారవీ షరీఫ్ సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రభుత్వ వైద్యులచే ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 90 మందికి పైగా బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గౌసే ఆజం రజియల్లాహు అన్హు వారి చిరస్మరణ సభను నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుకు అనుమతించిన గౌరవ కలెక్టర్ బాలాజీ కి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముస్లిం మత గురువులు, ఇనుగుదురుపేట ఎస్ఐ. సర్వర్ బేగ్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం ఏర్పాటు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు

# 16 ఏళ్లుగా సేవలు.. ఇకనైనా ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలి

- అమలాపురం కలెక్టరేట్ వద్ద పారామెడికల్ సిబ్బంది నిరసన..
- కలెక్టర్‌కు వినతిపత్రం..బుధవారం నుంచి పూర్తి స్థాయి విధుల బహిష్కరణకు నిర్ణయం..



**అమలాపురం,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** తమ ఉద్యోగాలను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర పారామెడికల్ సిబ్బంది సోమవారం అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ నిరసన చేపట్టారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి సుమారు 300 మంది సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. గత 16 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇంతకాలం సేవలు అందిస్తున్న తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరారు. గతంలో ప్రభుత్వం, ఉద్యోగ సంఘాల మధ్య జరిగిన చర్చల్లో సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నెల రోజుల సమయం కోరిందని, ఆ గడువు ముగిసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన స్పందన రాలేదని పేర్కొన్నారు.. తమ డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకుని ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని వారు కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ఆందోళనను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించినట్లు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపారు. మంగళవారం అత్యవసర సేవలను మినహాయించి విధులకు దూరంగా ఉండాలని, బుధవారం నుంచి పూర్తి స్థాయిలో విధుల బహిష్కరణ చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ నిరసన కార్యక్రమంలో డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్, జనరల్ సెక్రటరీ త్రినాథ్, ఇర్ఫాన్, స్వామి, మౌనిక, సుజాత, ఏపీజీసీఎన్ఏ జాయింట్ సెక్రటరీ అచ్చుతావల్లి, జిల్లా స్టాఫ్ నర్సెస్ యూనియన్ అధ్యక్షురాలు ఎం. శివకుమారి, జనరల్ సెక్రటరీ ఎన్. విజయ, జాయింట్ సెక్రటరీ సునంద, ట్రెజరర్ విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

# కబడ్డీ, పవర్‌లిఫ్టింగ్‌లో శోభనాపురం విద్యార్థి, కోచ్ ప్రతిభ

- రాష్ట్రస్థాయి కబడ్డీకి సాయి శంకర్ ఎంపిక..
- జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్‌కు సుభానీ అర్హత



**ఆగిరిపల్లి,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** దినపత్రిక)ఆగిరిపల్లి మండలం శోభనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చిత్రోజు సాయి శంకర్ క్రీడల్లో ప్రతిభ చాటాడు. సెప్టెంబరు 4న ఏలూరులోని సీఆర్ఆర్ కళాశాలలో నిర్వహించిన 36వ సబ్‌జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ దాసరి రామ్ ప్రసాద్, నలజాల హరిబాబు తదితరులు సాయి శంకర్‌ను అభినందించారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థులకు క్రీడా శిక్షణ అందిస్తున్న వాలంటరీ కోచ్ ఎస్.కె. సుభానీ తిరువూరులో జరిగిన 13వ రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని క్లాసిక్, ఎక్విప్డ్ బెంచ్‌ప్రెస్ విభాగాల్లో ద్వితీయ స్థానం సాధించాడు. దీంతో జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన సుభానీని గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యామినీ కృష్ణప్రియ తెలిపారు. విద్యార్థి సాయి శంకర్, కోచ్ సుభానీలను ఎంఈఓ-1 సత్యనారాయణ, ఎంఈఓ-2 కె. ఆనంద్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

# రోటరీ పోటీల్లో గౌతమ్ విద్యార్థుల ప్రతిభ



**గుడివాడ,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జి.వి. పూర్ణచంద్రరావు రోటరీ భవనంలో సెప్టెంబర్ 19 నుండి అక్టోబర్ 3 వరకు నిర్వహించిన యూత్ ఫెస్టివల్ పోటీల్లో డా. కె.కె.ఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. విజేతల వివరాలు : ఉపన్యాసం : 10వ తరగతి - ఎ.చేతన (1వ స్థానం), ఇ.దువంత్ (3వ), 9వ తరగతి - బి.విద్యాధర్ (3వ) క్విజ్ : 1వ స్థానం, స్పెల్-బీ : ఎ.చేతన (3వ) క్లాసికల్ డాన్స్ సోలో : సబ్ జూనియర్ - బి.ఆద్య (1వ), జూనియర్ - బి.తేజస్విని (1వ), ఎం. హరిణిక (2వ), కె.ధాత్రిక & జి.రిషిక (3వ) గ్రూప్ డాన్స్ క్లాసికల్: సబ్ జూనియర్ - ఎస్.కృతినయన, బి.ఆద్య (1వ), జూనియర్ - ఎ.రాజ్యశ్రీ, ఎం.వర్షిణి (2వ) జానపద నృత్యం : సబ్ జూనియర్ - వి.మృదుల, బి.హాశ్విక (3వ), సీనియర్ - బి.లక్షిత, బి.నిత్యశ్రీ (3వ) స్పాట్ పెయింటింగ్ : సబ్ జూనియర్ - బి.వర్ణిక (1వ), కె.పూర్విక (2వ), ఆర్.శ్రేష్ఠ (3వ), జూనియర్ - ఎం.అమిత (3వ), సీనియర్ - జి.శివశరణ్య (1వ) క్లాసికల్ గ్రూప్ సాంగ్స్ లో జూనియర్స్ 3వ స్థానం, సీనియర్స్ 2వ స్థానం సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఆవరణలో జరిగిన సభలో ప్రిన్సిపాల్ సత్యారామ్, లక్ష్మీప్రసాద్, జ్యోతి, ప్రశాంతి తదితర ఉపాధ్యాయులు అభినందించారు.

# గ్రామీణ వైద్యుల పార్టీ మాది కాదు -సాగిరాజు స్పష్టీకరణ



**గుడివాడ,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** జాతీయ గ్రామీణ వైద్యుల సంఘం అనే రాజకీయ పార్టీకి తమ ఆర్ఎంపి, పీఎంపి సంఘాలకు ఎలాంటి సంబంధం లేదని రూరల్ వైద్యుల సంక్షేమ సంఘం ఏపీ రాష్ట్ర ఇన్చార్జి అధ్యక్షులు సాగిరాజు ఉదయ భాస్కరరాజు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడకు చెందిన కొండిశెట్టి సురేష్ జాతీయ గ్రామీణ వైద్యుల సంఘం అనే పార్టీని స్థాపించి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించడం ఆయన వ్యక్తిగత అభిప్రాయమని, ఆయన రాష్ట్రంలో చురుగ్గా పనిచేస్తున్న మూడు ఫెడరేషన్ల నాయకుడు కాదని తెలిపారు. గ్రామీణ వైద్యుల పార్టీ అనే పేరుతో ఆర్ఎంపి, పీఎంపి వైద్యుల్లో అలజడి రేగే ప్రమాదం ఉందని, రాజకీయ పార్టీలు తమపై దురభిప్రాయం వ్యక్తం చేస్తాయనే ఆందోళన ఉందన్నారు. అలాగే గ్రామీణ వైద్య సంఘాల పెద్ద భీమరాజు అండతోనే పార్టీ పెట్టారనే ప్రచారంలో వాస్తవం లేదని, భీమరాజు అనే వ్యక్తి తమ మూడు ఫెడరేషన్లలో లేరని సాగిరాజు ఉదయ భాస్కరరాజు స్పష్టం చేశారు.

# అసమానతలపై అక్షర సమరం గుర్రం జాషువా జయంతి




**గుడివాడ,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** సమాజంలో అసమానతలకు గురియవుతున్న వారికి అండగా నిలిచి తన రచనల ద్వారా మనోధైర్యం కలిపించిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువ స్ఫూర్తితో ఈనాటి సమాజం అడుగు ముందుకు వేయాలని విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి కాకొల్లు బస్మాకరరావు పేర్కొన్నారు. తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో ఐసిసి అకాడమీ లో జాషువ 131వ, జయంతి వేడుకలకు బస్మాకరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. కుల రహిత సమాజం కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ సందర్భంగా విద్యావేత్త చొరగుడి ఇజ్రాయిల్ కు గుర్రం జాషువ సాహితీ స్ఫూర్తి పురస్కారం -2026 ను ప్రదానం చేశారు. సాహితీ వేత్త వంగిపురపు వీర రఘువాచారి, మోకా మాధవరావు, సమితి సమన్వయకర్త డి ఆర్ బి ప్రసాద్, సయ్యద్ గఫార్, పల్లపు అనిల్ కుమార్, గాదె మోహన్‌బాబు, లంకపల్లి లాజర్ వల్లభాపురపు కిషోర్, జి సుమన్ కుమార్, రిటైర్డ్ ఎస్ ఐ శ్యాంసన్, గుమ్మడి రవిబాబు, జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సత్తా చాటిన విశ్వభారతి విద్యార్థులు



**గుడివాడ,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** పట్టణం నందు రోటరీ క్లబ్ వారు విద్యార్థులకు నిర్వహించిన అనేక పోటీలలో సత్తా చాటిన విశ్వభారతి విద్యార్థులు.. ఉపన్యాసం, వ్యాసరచన, గీతాలాపన, నృత్య ప్రదర్శన, స్పెల్ బీ, చిత్రలేఖనం, కూచిపూడి మరియు భరతనాట్యం, విచిత్ర వేషధారణ, క్విజ్, మ్యూజికల్ చైర్స్ మొదలైన విభాగాలలో 79 మంది విద్యార్థులు బహుమతులు కైవసం చేసుకున్నారు. పాల్గొన్న ప్రతి విభాగంలో బహుమతులు కైవసం చేసుకోవడం ఒక్క విశ్వభారతి విద్యార్థులకు మాత్రమే సాధ్యమైంది. తమ అసమానమైన ప్రతిభతో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ అభినందించారు.

# ఘనంగా అంగన్వాడీ ఉత్సవాలు...



**గుడ్లవల్లేరు,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** మండలంలోని విన్నకోటలో సోమవారం ఘనంగా అంగన్వాడి ఉత్సవాలను నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ అబ్దుల్ నసీరున్నీసా, పాఠశాల హెచ్ఎం ఇంటి చక్రవర్తి, అంగన్వాడీ కార్యకర్త డి.అమ్మాజీ, ఆశ వర్కర్ గోపు నాగమణి, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన ఇద్దరికీ 20 వేల రూపాయలు జరిమానా

**మచిలీపట్నం,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికీ సెకండ్ క్లాస్ మాజీస్ట్రేట్ కోర్టు జరిమానా విధించింది. బందరు ట్రాఫిక్ పోలీసు ఇనకుదురు పోలీసు వారు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ లో వీరు పట్టుబడ్డారు. సోమవారం వీరిని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా విచారించిన న్యాయమూర్తి భూపతిరెడ్డి శ్రీనివాసు వీరికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున జరిమానా విధించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత, సకాలంలో పరిష్కారమే లక్ష్యం

- అర్జీలను కేవలం ఎండార్స్ చేసి వదిలేయకుండా శాశ్వత పరిష్కారం చూపాలి
- ప్రజా సంతృప్తినే ప్రధాన ప్రమాణంగా తీసుకోవాలి నిర్లక్ష్యం వహించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు
- జిల్లాను గ్రీవెన్స్ పరిష్కారంలో రాష్ట్రంలో ముందంజలో నిలపాలి
- జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ





**విజయవాడ,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు, ప్రతి అర్జీకి నాణ్యమైన, న్యాయబద్ధమైన, శాశ్వత పరిష్కారం అందించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ ఆదేశించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారంలో ప్రజా సంతృప్తినే ప్రధాన ప్రమాణంగా తీసుకుని, గ్రీవెన్స్ పరిష్కారంలో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, తదితర అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రాబోయే నెల రోజుల్లో ముఖ్యమంత్రి 'ప్రజా వేదిక' కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శాఖల వారీగా అధికారుల పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారం, ఫిర్యాదులపై స్పందన తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించే అవకాశం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతికూల నివేదికలు వచ్చే శాఖలు, అధికారులు ముఖ్యమంత్రి సమక్షంలో సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి శాఖ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అధికారుల పనితీరును పబ్లిక్ ఫీడ్‌బ్యాక్, రియల్ టైమ్ గవర్నెన్స్ డేటా, ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సమీక్షిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను ప్రతి అధికారి నిశితంగా పరిశీలించుకోవాలని, తమ పరిధిలో ప్రజా సంతృప్తి ఎందుకు తక్కువగా ఉందో గుర్తించి తక్షణమే సరిదిద్దుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అధికారులు అందుబాటులో లేకపోవడం, పిటిషన్లు, ఫిర్యాదులపై సరైన స్పందన లేకపోవడంపై జిల్లా కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను స్వయంగా విని, వాటి పరిష్కారానికి నిర్దిష్ట చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తిరువూరు, విజయవాడ వెస్ట్ జోన్, జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సంతృప్తి శాతం తక్కువగా ఉండటంపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ప్రజా సంతృప్తి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సమస్యలకు గల కారణాలను క్షేత్రస్థాయిలో గుర్తించి, ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలు తమ పరిధిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, శాఖల పనితీరును క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ఉన్నతాధికారులు క్రమం తప్పకుండా ఫీల్డ్ విజిట్స్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యాలయాల్లో కూర్చొని నివేదికలను పరిశీలించడం మాత్రమే కాకుండా, ప్రజల వద్దకు వెళ్లి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించి, వాటికి అక్కడికక్కడే పరిష్కార మార్గాలు చూపేలా అధికారులు పనిచేయాలని అన్నారు. జిల్లాలోని 14 మండలాల్లో 11 మండలాలు తీవ్ర కరువు పరిధిలోకి వచ్చిన నేపథ్యంలో రైతులకు అవసరమైన సహాయం అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రైమరీ, సెకండరీ, సెక్షన్ స్థాయి అధికారులు రైతుల సమస్యలపై తక్షణమే స్పందించాలని సూచించారు. రైతులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయం, సేవలు సకాలంలో అందేలా సమన్వ యంతో పనిచేయాలని అన్నారు. రైతులకు సహాయం అందించడంలో రాష్ట్రంలో జిల్లా ముందంజలో ఉండేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విజయవాడ డివిజన్ పరిధిలో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్న తీరుపై జిల్లా కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి ర్యాంకింగ్స్‌లో విజయవాడ డివిజన్, రూరల్ మండలం రెడ్ లిస్ట్‌లో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్జీలను కేవలం సంబంధిత శాఖలకు ఎండార్స్ చేసి బాధ్యత ముగిసిందని భావించకూడదని, సమస్య పరిష్కారం అయ్యే వరకు అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి, వాస్తవ సమస్యను గుర్తించి, నిర్ణీత గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడంలో విఫలమయ్యే లేదా అశ్రద్ధ వహించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు ప్రారంభిస్తామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీ ప్రభుత్వంపై వారికి ఉన్న నమ్మకానికి ప్రతిబింబమని, అందువల్ల ఒక్కో ఫిర్యాదును బాధ్యతతో పరిష్కరించాలని అన్నారు. కేవలం గణాంకాలను మెరుగుపరచడం కాకుండా, ప్రజలకు వాస్తవమైన పరిష్కారం అందించడమే ప్రభుత్వ యంత్రాంగం లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ప్రజల భాగస్వామ్యం, అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్, వ్యవసాయం, రెవెన్యూ తదితర ముఖ్య శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు అందాల్సిన సేవల్లో జాప్యం, నిర్లక్ష్యం, అనవసర ఇబ్బందులకు తావులేకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలపై వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ సరిదిద్దే చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కేవలం అర్జీల సంఖ్యను తగ్గించడం కాకుండా, ప్రజలు నిజంగా సంతృప్తి చెందారా లేదా అన్నదే అధికారుల పనితీరుకు ప్రధాన కొలమానం కావాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి అధికారి తమ పరిధిలోని పీజీఆర్ఎస్ అర్జీలు, ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్, పబ్లిక్ సాటిస్‌ఫాక్షన్ స్కోరు, రియల్ టైమ్ గవర్నెన్స్ డేటాను నిరంతరం పరిశీలించి, లోపాలను సరిదిద్దుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలకు సకాలంలో స్పందిస్తూ, నాణ్యమైన పరిష్కారాలు అందించడం ద్వారా జిల్లాను రాష్ట్రంలో గ్రీవెన్స్ పరిష్కారంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి అధికారి కట్టుబాటుతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు.

## న్యాయవాదులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయండి

-ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోనే సీతారామారావు డిమాండ్






**ఏలూరు,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరుతూ గత కొన్ని రోజులుగా ఏలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో రిలే నిరాహార దీక్షలు జరుగుతున్నాయి. న్యాయవాదులపై పోలీసుల దౌర్జన్యం నశించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోనే సీతారామారావు మాట్లాడుతూ ఇటీవల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న న్యాయవాదులపై జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న దాడులను ఖండించారు. దీనిపై త్వరలోనే న్యాయశాఖ మంత్రి కి వినతిపత్రాన్ని సమర్పిస్తామని తెలిపారు. ఈనెల 9వ తేదీ వరకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు జరుగుతాయని స్పష్టం చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టం తప్పనిసరిగా ఏర్పాటు చేసే విధంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నిమ్మల జ్యోతి కుమార్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని వీటన్నిటిని అరికట్టే విధంగా న్యాయవాదుల యాక్ట్ అమలు చేసేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలో అధిక సంఖ్యలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు.

## మత్స్యకారులకు ఆయిల్ కార్డుల పంపిణీ



**మచిలీపట్నం,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** మచిలీపట్నం మండలం పెద్దకానూరు గ్రామంలో బోటు యజమానులకు సోమవారం ఆయిల్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 50 మంది బోటు యజమానులకు ఆయిల్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా గోపు సత్యనారాయణ మాట్లాడుతూ మత్స్యకారులకు ఒక్క లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. మోటరైజ్డ్ బోట్లకు నెలకు 300 లీటర్ల వరకు డీజిల్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేల భృతిని అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ బండి వీరస్వామి, పీత రాము, బొమ్మిడి పెద్ద ఏడుకొండలు, బోటు యజమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొండలమ్మకు రూ.27.82లక్షల ఆదాయం



**గుడ్లవల్లేరు,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** మండలంలోని వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలోని హుండీలలోని భక్తులు వేసిన కానుకలను సోమవారం మచిలీపట్నం తనిఖీదారు కే శ్రీనివాసరావు పరివేక్షణలో లెక్కించారు. అమ్మవారి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు, ఈవో ఆకుల కొండలరావు సభ్యులు కళ్ళేపల్లి సుగుణ శేఖర్, మన్నెం వీర నాగేంద్రరావు, ముంగం ఆంజనేయులు, తూము రాజ్యలక్ష్మీ, నూతలపాటి లక్ష్మీ పావని, పెన్నేరు వీర వెంకట నాగ లీల శేఖర్, వడ్లమన్నాడు ఇండియన్ బ్యాంక్ సిబ్బంది సమక్షమున తెరిచి లెక్కించడం జరిగింది. మొత్తం 64రోజులకు గాను నోట్లు ద్వారా రూ.25,16,520, చిల్లర ద్వారా రూ.2,65,747 వెరసి మొత్తము రూ.27,82,267 మరియు అమ్మవారి అన్నదానం హుండీ ద్వారా నోట్లు రూ.59,660, మరియు చిల్లర ద్వార రూ.4,620 వచ్చింది. హుండీ లెక్కింపు కార్యక్రమములో దేవస్థానము సిబ్బంది, వుయ్యూరు, గుడ్లవల్లేరు, వేమవరం సేవా సమితి వారు మరియు వేమవరం గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**నేడు అమ్మవారి సన్నిధిలో వరుణ యాగం....** దేవాదాయ ధర్మదాయశాఖా కమిషనర్ వారి ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 8.00 ల నుండి అమ్మవారి సన్నిధిలో వరుణ యాగం నిర్వహించనున్నామని చైర్మన్ మోహన్, ఈవో కొండలరావు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా పడుటకు శ్రీ అమ్మవారి ఆలయంలో వరుణయాగం, వరుణజపం నిర్వహించబడునని పేర్కొన్నారు.

## పేకాట డెన్ పై పోలీసులు దాడి

- పోలీసుల అదుపులో 9 మంది
- రూ.14,880 నగదు స్వాధీనం



**జి.కొండూరు,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం,కట్టుబడిపాలెం గ్రామంలో పేకాట డెన్ పై పోలీసులు కొరడా ఝుళిపించారు. గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నారని పక్కా సమాచారం మేరకు జి.కొండూరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ కె.సతీష్ కుమార్ సిబ్బంది తో కలిసి మెరుపు దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు.ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జూదం (పేకాట)ఆడుతున్న 9 మంది వ్యక్తులను నుంచి రూ.14,880 లు, జూదంలో వినియోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.సదరు నిందితులపై ఏపి గేమింగ్ యాక్ట్ , సెక్షన్ 9(1) ప్రకారం కేసు నమోదు చేశారు.జూదం ఆడటం చట్టరీత్యా నేరమని, దీని వలన కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడంతో పాటు సమాజంలో అనేక అనర్థాలు జరుగుతాయని ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు.జి.కొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జూదం, గుడిసెల పేకాట వంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతరం నిఘా పెడుతున్నట్లు వెల్లడించారు.పేకాట, కోడి పందాలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడిలో జి.కొండూరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఉత్సవం సేవా సంకల్ప కార్యక్రమం....



**పెనుగంచిప్రోలు,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు ప్రాజెక్ట్ ఐసిడిఎస్ సిడిపిఓ సత్యవతి ఆదేశాల మేరకు సోమవారం పెనుగంచిప్రోలు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం. 5 నందు మరియు అనిగండ్ల పాడు శనగపాడు అంగన్వాడీ కేంద్రం 3 లో గుమ్మడి దూరు అంగన్వాడీ కేంద్రం 3 లో ముచ్చింతాల అంగన్వాడీ కేంద్రం 1 లో పోషణ మాసంలో భాగంగా అంగన్వాడీ ఉత్సవం సేవా సంకల్ప కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గర్భవతులకు బాలింతలకు మునగాకు చిరుధాన్యాలు కూరగాయల యొక్క ప్రాముఖ్యతను లబ్ధిదారులకు వివరించడం జరిగింది ఆహారంలో మునగాకు తీసుకోవడం వల్ల ఐరన్ శాతం పెరుగుతుంది మునగాకు తోటకూర చపాతి చిరుధాన్యాలతో జావా తీసుకోవడం వల్ల నిరోధక శక్తి పెరుగుతుందని, పాలు గుడ్లు లో ఉన్న పోషక విలువల గురించి ప్రీ స్కూల్ పిల్లలు విద్యా బోధన గురించి తల్లులకు గర్భవతులకు బాలింతలకు వివరించడం జరిగింది, అలాగే అనిగండ్లపాడు లో ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి, ఎ ఎన్ ఎం లు ఆశ వర్కర్స్ గర్భవతులు బాలింతలు7నుండి 3సంవత్సరాల తల్లులు, అంగన్వాడి కార్యకర్తలు హెల్పర్స్ పాల్గొన్నారు...

## పేదవాడి ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

- 30వ డివిజన్ లో నలుగురు లబ్ధిదారులకు రూ.1.26లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



**మచిలీపట్నం,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** పేదవాడి ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు గొర్రెపాటి గోపిచంద్ అన్నారు. స్థానిక 30వ డివిజన్ కాలేఖాన్ పేటకు చెందిన నలుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.1,26,966లు చెక్కులను డివిజన్ ఇన్ ఛార్జ్ పిప్పళ్ల వెంకన్నతో కలిసి ఆయన అందజేశారు. ఇటీవల అనారోగ్య సమస్యలతో శస్త్ర చికిత్స చేయించుకున్న మట్టా కస్తూరికి రూ.23,700లు, గుమ్మడి దుర్గకు రూ.20వేలు, రాయవరపు వాణికి రూ.22,271లు, అంకటటం కోటేశ్వరరావుకు రూ.60,995లు విలువ చేసే చెక్కులను వారు అందజేశారు. ఈ సందర్భంగా గోపిచంద్, వెంకన్న మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పెద్ద ఎత్తున పేదలకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో మచిలీపట్నం నియోజకవర్గంలో రూ.6కోట్ల 30 లక్షల మేర సీఎం రిలీఫ్ కింద ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. రాష్ట్రం అనే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ముద్రగడ వెంకటేశ్వరరావు (నాని), వీరవల్లి సాంబశివరావు, అనుమకొండ సాయి, పోతన వంశీ, గోళ్ళ నాగ వెంకట వరప్రసాద్, కొడాలి ఆంజనేయులు, మురాల వెంకటేశ్వరరావు, ముద్రగడ శ్రీనివాసరావు, హనుమకొండ వెంకట నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

# మేయర్ రేసులో 'ఐలాపురం రాజా' పేరు!

- టీడీపీ అభ్యర్థిగా నగరంలో జోరుగా చర్చ
- నగరంతో సుదీర్ఘ అనుబంధం.. పరిపాలనా అనుభవం.. అన్ని వర్గాలతో సంబంధాలు
- సామాజిక సేవ నుంచి సమాచార కమిషనర్ వరకు విస్తృత ప్రస్థానం

**విజయవాడ,అక్టోబర్ 5 (వార్తాప్రభ) :** విజయవాడ మేయర్ పదవికి అభ్యర్థి ఎంపికపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ తరఫున ఐలాపురం రాజా పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రత్యేకించి మేయర్ పదవి ని బీసీలకు కేటాయిస్తే రాజా బలమైన అభ్యర్థి అవుతారని భావిస్తున్నారు. నగరంతో సుదీర్ఘ అనుబంధం, వివిధ రంగాల్లో పనిచేసిన అనుభవం, పరిపాలనా బాధ్యతలు నిర్వహించిన నేపథ్యం, సామాజిక--సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకైన పాత్ర, వివిధ సామాజిక వర్గాలతో ఉన్న సంబంధాలు ఆయన పేరును తెరపైకి తెస్తున్న అంశాలుగా ప్రచారం జరుగుతోంది. మేయర్ అభ్యర్థిత్వంపై పార్టీ పరంగా తుది నిర్ణయం వెలువడాల్సి ఉన్నప్పటికీ.. రాజా పేరు మాత్రం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. విజయవాడలో జన్మించిన ఐలాపురం రాజా నగరంతో సుదీర్ఘ అనుబంధం కలిగి ఉన్నారు. ఆయన తండ్రి ఇలాపురం వెంకయ్య రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పనిచేశారు. ఆ సందర్భంలో ఆయన గెలుపుకు తెర వెనుక మంత్రాంగం నడిపింది రాజానే. అలా ఎన్నికలను సమర్థ వంతంగా ఎదుర్కోగలిగిన సత్తా ఉంది. సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసిన రాజా.. అమెరికాలోని న్యూ హాంప్‌షైర్ కాలేజీ నుంచి ఇంటర్నేషనల్ బిజినెస్‌లో ఎంబీఏ చేశారు.



**పరిపాలనా అనుభవం కీలకంగా..** రాజా గతంలో ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్‌లో స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా పనిచేశారు. 2019 మే నుంచి 2024 మే వరకు ఈ బాధ్యతల్లో ఉన్నారు. తన పదవీకాలంలో దాదాపు 11 వేల అప్పీలు, ఫిర్యాదులను పరిష్కరించి రాష్ట్ర స్థాయిలో రికార్డు సృష్టించారు. అంతకుముందు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విజయవాడ కన్సల్టేటివ్ కమిటీలో, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్సల్టేటివ్ కమిటీలో సభ్యుడిగా పనిచేశారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌లోనూ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. మేయర్ పదవి కేవలం రాజకీయ బాధ్యత కాకుండా.. నగర పాలన, మౌలిక వసతులు, ప్రజా సేవలు, వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయంతో ముడిపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో పరిపాలనా వ్యవస్థపై అవగాహన ఉన్న వ్యక్తిగా రాజా అనుభవాన్ని ఆయన అనుచరులు ప్రస్తావిస్తున్నారు. మరోవైపు దేశ విదేశాలలో ఆయనకు ఉన్న సత్ సంబంధాలు నగర అభివృద్ధికి ఎంతగానో దోహదం చేసే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి ఎంతో మక్కువతో ప్రారంభించిన పి4 కార్యక్రమం వంటి వాటిని ముందుకు తీసుకెళ్లడంలో రాజా మెరుగైన పాత్రను పోషించే అవకాశం ఉంది.

**వరదల సమయంలో సేవలు..** విజయవాడ హోటలియర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా రాజా పనిచేశారు. తుపాన్లు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఇళ్లు కోల్పోయిన వేలాది మందికి జిల్లా యంత్రాంగం ద్వారా ఆహారం అందించడంలో హోటలియర్స్ అసోసియేషన్ తరఫున సహకరించారు. ఆ సమయంలో వేలాది మందికి అన్న పానీయాలు అందించారు. నగరంలోని వ్యాపార, హోటల్ రంగాలతో ఉన్న అనుబంధం కూడా ఆయనకు ప్లస్ పాయింట్ కానుంది.

**బీసీ, బలహీన వర్గాలతో అనుబంధం..** బీసీ, బలహీన వర్గాల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల్లోనూ రాజా పనిచేశారు. కుమ్మర శాలివాహన సహకార సంఘాల సమాఖ్య ఏర్పాటులో కీలకంగా వ్యవహరించినట్లు ఆయన వివరాల్లో ఉంది. ఈ వ్యవస్థ ద్వారా ఆర్థికంగా అవసరమైన వారికి సహాయం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు, దాదాపు 11 వేల మందికి సుమారు రూ.60 కోట్ల మేర ప్రయోజనాలు కల్పించారు. సాధారణంగా బీసీలు అంటే యాదవ, గౌడ, పద్మశాలీ కులాలకు చెందిన వారే ఎక్కువగా కనిపిస్తారు. కానీ కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన ఐలాపురం రాజాకు కూటమి ప్రభుత్వం అవకాశం కల్పిస్తే బిసి లలోని ఇతర అణగారిన వర్గాలకు కూడా న్యాయం చేసినట్లు అవుతుందని భావిస్తున్నారు. మరోవైపు వారంతా తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలుస్తారని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**సాంస్కృతిక రంగంలోనూ గుర్తింపు..** అమరావతి నృత్యోత్సవ్ ద్వారా అనేక సంవత్సరాలుగా ప్రముఖ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించిన అనుభవం రాజాకు ఉంది. అలాగే ఎలూరు రోడ్డులోని రామమందిరం ట్రస్టీగా సుదీర్ఘకాలంగా వివిధ ధార్మిక, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం వహిస్తూ వచ్చారు. వివిధ రంగాల్లో పనిచేసిన క్రమంలో రాజకీయ పార్టీల నాయకులు, పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వ అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులతో మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. మరో వైపు అన్ని సామాజిక వర్గాల నాయకులతోనూ రాజాకు పరిచయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విజయవాడ మేయర్ పదవికి టీడీపీ అభ్యర్థి ఎంపికపై చర్చ జరుగుతున్న వేళ ఇలాపురం రాజా పేరు ప్రాధాన్యం సంతరించుకోవడం ఆసక్తికరంగా మారింది. నగర రాజకీయాలు, సామాజిక సమీకరణాలు, కూటమి పార్టీల మధ్య అవగాహన, మేయర్ పదవికి సంబంధించిన రిజర్వేషన్ తదితర అంశాలు తుది నిర్ణయంలో కీలకంగా మారే అవకాశం ఉంది. పార్టీ అధిష్ఠానం నిర్ణయం తర్వాతే అభ్యర్థిత్వంపై స్పష్టత రానుంది. అయితే ప్రస్తుత చర్చలో "మేయర్ రేసులో రాజా" అన్న మాట గట్టిగా వినిపిస్తున్నది

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188